విశాఖపట్టణం
ఆదివారం 17 మే 2026

For a pure tomorrow..

# జయజయహే

jayajayahey.in | సంపుటి: 9 | సంచిక: 113 | వెల: రూ.5/- | పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ఏపీ నుంచి రాజ్యసభకు అన్నామలై..?

నాలుగు స్థానాల్లో ఒకటి బీజేపీ కోటాకి

కాషాయదళం వ్యూహం

సీఎం విజయ్‌కు చెక్ పెట్టేలా ప్లాన్



2

# పిల్లలు భారం కాదు.. రాష్ట్రానికి సంపద

మూడో బిడ్డ పుడితే రూ. 30వేలు ఇస్తాం

నాలుగో బిడ్డకు జన్మనిస్తే రూ. 40 వేలు ఇస్తాం

వృద్ధ ఆంధ్రప్రదేశ్ కాకుండా నివారిస్తాం

యువశక్తిని నిర్మిస్తాం... భవిష్యత్తును ఇస్తాం

నరసన్నపేట సభలో సీఎం చంద్రబాబు ప్రకటన






(శ్రీకాకుళం - జయజయహే)

రాష్ట్రంలో మారుతున్న జనాభా సమీకరణాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక గళం విప్పారు. గత కొన్ని దశాబ్దాలుగా అనుసరిస్తున్న జనాభా నియంత్రణ విధానాలకు స్వస్తి పలికి, ఇప్పుడు జనాభా నిర్వహణ అనే కొత్త మంత్రాన్ని ఆయన తెరపైకి తెచ్చారు. పిల్లలు భారం కాదు.. వారు రాష్ట్రానికి అసలైన సంపద అని స్పష్టం చేస్తూ, ఎక్కువ మంది పిల్లలను కనే కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నేరుగా ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో రాష్ట్రం వృద్ధుల ఆంధ్రప్రదేశ్ గా మారకుండా ఉండాలంటే యువశక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. నరసన్నపేట సభ వేదికగా చంద్రబాబు సరికొత్త ప్రోత్సాహకాలను వివరించారు. కుటుంబంలో మూడో బిడ్డ జన్మిస్తే రూ. 30,000 , నాలుగో బిడ్డ జన్మిస్తే రూ. 40,000 చొప్పున ప్రభుత్వం తరఫున నగదు ప్రోత్సాహకం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. కేవలం నగదు సాయమే కాకుండా, ఆ బిడ్డల సంరక్షణ, పౌష్టికాహారం ..మిగతా 2లో



## పరిశ్రమల శక్తి కేంద్రం రాయలసీమ

ఫైటర్ ఫ్లైట్స్ నుంచి డ్రోన్స్ వరకు తయారీ

తయారీ రంగంలో సరికొత్త హబ్

ఏఐ వీడియోను షేర్ చేసిన మంత్రి లోకేశ్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రాయలసీమను పరిశ్రమల శక్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఫైటర్ ఫ్లైట్స్ నుంచి డ్రోన్స్ వరకు అత్యాధునిక రక్షణ, టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి ప్రాంతం సిద్ధమైందని వివరిస్తూ ఓ వీడియో పోస్ట్ చేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ రాకతో తయారీ రంగంలో కొత్త ఉత్సాహం నెలకొందని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధి ఆశయాలకు రాయలసీమ ఒక కీలక శక్తిగా మారనుందన్న సంకేతాలతో ఓ ఏఐ వీడియోను మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం ప్రస్తుతం ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, రక్షణ (డిఫెన్స్) పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా ..మిగతా 2లో

# సంపద సృష్టి కాదు.. సంక్షోభ సృష్టికర్త

రాష్ట్రానికి ఆర్థిక అనారోగ్యం

2025 - 26 ఖాతాల్లో వైఫల్యం బట్టబయలు

స్థూల ఉత్పత్తి పెరిగిందని గొప్పలు

కానీ, పన్ను ఆదాయం తగ్గుతోంది

ప్రభుత్వ అసమర్థతకు ఇదే నిదర్శనం

కూటమి సర్కారుపై మాజీ సీఎం జగన్ నిప్పులు



(తాడేపల్లి - జయజయహే)

రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ప్రచురించిన 2025-26 ఆర్థిక సంవత్సర తాత్కాలిక ఖాతాలను విశ్లేషిస్తూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతున్న అభివృద్ధి లెక్కలకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని.. రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక ..మిగతా 2లో



## అండమాన్‌కు నైరుతి!

తీరానికి ప్రవేశించిన రుతుపవనాలు

నాలుగు రోజుల్లో మరింత విస్తరణ

జూన్ రెండో వారానికి తెలుగు రాష్ట్రాలకు

2




## ముందుంది.. బాదుడు

మళ్లీ పెట్రో డీజిల్ ధరల పెంపు

లీటర్‌పై రూ. 10 వరకు పెంచే యోచన

కేంద్ర ప్రభుత్వం సంకేతాలు

ఒకేసారి భారం మోపకుండా ఎత్తుగడ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు బ్యారెల్‌కు 106-110 డాలర్లకు చేరడం, రూపాయి విలువ క్షీణించడం దేశంలో ఇంధన సంక్షోభానికి దారితీస్తోంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం ఈ పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. శుక్రవారం మే 15 న దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.3 చొప్పున పెరిగినప్పటికీ, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, రానున్న రోజుల్లో ధరలు మరింత పెరగడం ఖాయమని తెలుస్తోంది. ప్రస్తుత రూ.3 పెంపుతో ..మిగతా 2లో

## మూడు భాషల విధానం

సీబీఎస్ఈలో విప్లవాత్మక మార్పులు

స్కూల్ లాంగ్వేజ్‌లో ప్రాంతీయ భాషలకు చోటు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)




దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ స్కూళ్లలో లాంగ్వేజ్ విధానంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. రాబోయే 2026 జులై 1 నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు 'మూడు భాషల విధానాన్ని ' తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ అధికారికంగా సర్క్యులర్ జారీ చేసింది. జాతీయ విద్యా విధానం , నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది.

2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన నూతన సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ మార్పులు చేసినట్లు బోర్డు స్పష్టం చేసింది. ఏప్రిల్‌లోనే ..మిగతా 2లో

## నేటి నుంచి మోదకొండమ్మ జాతర

పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు

2




## వెండి దిగుమతిపై బ్యాన్

ఇంపోర్ట్ చేసుకోవాలంటే లైసెన్స్ తప్పనిసరి

వాణిజ్య లోటు అరికట్టే యత్నం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలోకి విపరీతంగా పెరుగుతున్న వెండి ఇన్‌ఫ్లోను నియంత్రించడానికి, పెరుగుతున్న వాణిజ్య లోటును అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. వెండి దిగుమతులకు సంబంధించి అంతకుముందు ఉన్న సరళీకృత విధానాన్ని మారుస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ..మిగతా 2లో

# పిల్లలు భారం కాదు..
# రాష్ట్రానికి సంపద

మొదటి పేజీ తరువాయి...

విద్య కోసం ప్రత్యేక ప్యాకేజీని రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అమలులో ఉన్న తల్లికి వందనం పథకం గురించి కూడా ముఖ్యమంత్రి సానుకూల వ్యాఖ్యలు చేశారు. పిల్లల చదువుల కోసం ఇచ్చే రూ. 15,000 ఆర్థిక సహాయాన్ని భవిష్యత్తులో మరింత పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. భగవంతుడు కరుణించి, రాష్ట్ర ఆర్థిక వనరులు మెరుగైతే ఈ సహాయాన్ని ఇంకా పెంచుతాము అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. చిన్న కుటుంబాల ధోరణి వల్ల భవిష్యత్తులో పని చేసే వారు తగ్గిపోయి, కేవలం వృద్ధులే మిగిలే ప్రమాదం ఉందని, దానిని అరికట్టేందుకు తల్లులు ముందుకు రావాలని ఆయన కోరారు.

దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో జననాల రేటు గణనీయంగా పడిపోతుండటం వల్ల కలిగే నష్టాలను చంద్రబాబు శాస్త్రీయంగా వివరించారు. యువత సంఖ్య తగ్గితే అభివృద్ధి కుంటుపడుతుందని, ఉత్పాదకత దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తానే జనాభా నియంత్రణకు పిలుపునిచ్చానని, అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు జనాభాను పెంచుకోవాల్సిన అనివార్యత ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. మళ్లీ ఇళ్లలో పిల్లల కిలకిలరావాలు వినిపించినప్పుడే రాష్ట్ర ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, జనాభా ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సీఎం పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలను జనాభా పెంపునకు అనుసంధానించడం ద్వారా భవిష్యత్తు తరాలకు అవసరమైన మానవ వనరులను ఇప్పుడే సిద్ధం చేసుకోవాలని ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. శ్రీకాకుళం పర్యటనలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.







## మూడు భాషల విధానం

మొదటి పేజీ తరువాయి...

విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ.. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా జులై నుంచి ఒక పరివర్తన ప్రక్రియ ద్వారా దీనిని అమలు చేయనున్నారు.

కొత్త నిబంధన ప్రకారం విద్యార్థులు అభ్యసించే మూడు భాషల్లో(ఆర్ 1, ఆర్ 2, ఆర్ 3) కనీసం రెండు భాషలు కచ్చితంగా స్థానిక భారతీయ భాషలై ఉండాలి. ఒకవేళ విద్యార్థులు ఫ్రెంచ్, జర్మన్ వంటి విదేశీ భాషలను చదవాలనుకుంటే.. మిగిలిన రెండు భాషలు భారతీయ భాషలైనప్పుడు మాత్రమే దానికి అనుమతి ఉంటుంది. లేదా విదేశీ భాషను 4వ అదనపు భాషగానూ ఎంచుకోవచ్చు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు గానూ ఈ నూతన విధానంలోని మూడో భాషకు 10వ తరగతిలో బోర్డు పరీక్ష ఉండదు. స్కూల్ స్థాయిలోనే ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా దీనికి మార్కులు లేదా గ్రేడులు ఇస్తారు. అయితే ఇందులో పాస్ కావడం మాత్రం తప్పనిసరి. మిడిల్ స్టేజ్(మిడిల్ స్కూల్), సెకండరీ స్టేజ్ చదువుల మధ్య లాంగ్వేజ్ స్కిల్స్, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి అంశాలలో 75 నుంచి 80 శాతం వరకు పోలికలు ఉంటాయని బోర్డు పేర్కొంది. అందువల్ల ప్రస్తుతానికి 9వ తరగతి విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన 6వ తరగతి స్థాయి ఆర్ 3 పాఠ్య పుస్తకాలనే ఉపయోగించనున్నారు. ఈ పుస్తకాలతో పాటు స్థానిక, రాష్ట్ర స్థాయి సాహిత్యానికి సంబంధించిన కథలు, కవితలను కూడా సిలబస్‌కు అదనంగా చేర్చాలని స్కూళ్లను ఆదేశించింది. దీనికి సంబంధించిన పూర్తి గైడ్‌లైన్స్‌ను 2026 జూన్ 15 నాటికి సీబీఎస్ఈ విడుదల చేయనుంది. జులై 1లోపు 19 అధికారిక భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి =3 పాఠ్య పుస్తకాలను బోర్డు అందుబాటులోకి తీసుకురానుంది.

## సంపద సృష్టి కాదు..
## సంక్షోభ సృష్టికర్త

మొదటి పేజీ తరువాయి...

సంక్షోభం వైపు కూరుకుపోతోందని ఆయన ఆరోపించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 10.75% వృద్ధి చెందిందని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోందని, కానీ ప్రభుత్వ పన్ను ఆదాయం మాత్రం 3.22% తగ్గడం విడ్డూరంగా ఉందని జగన్ విమర్శించారు. సాధారణంగా రాష్ట్రం వృద్ధి పథంలో ఉంటే పెట్టుబడులు, వినియోగం పెరిగి పన్ను వసూళ్లు కూడా పెరుగుతాయని, ఇక్కడ పన్ను ఆదాయం తగ్గడం అంటే ఆర్థిక మందగమనం ఉందనడానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాల్లో 9.60% వృద్ధి చూపి, వాస్తవంలో అది మైనస్ లోకి వెళ్లడం ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో (2023-24) రాష్ట్ర పన్ను ఆదాయం రూ. 85,922 కోట్లుగా ఉందని జగన్ గుర్తు చేశారు. సాధారణంగా 8% వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకున్నా, ఈ రెండేళ్లలో ఆదాయం రూ. 1,00,219 కోట్లు ఉండాలని.. కానీ ఇప్పుడు కేవలం రూ. 86,552 కోట్లే వసూలైందని గణాంకాలతో వివరించారు. ఈ లెక్కన ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సుమారు రూ. 13,667 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని, చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి ఇదేనా? అని ఆయన ప్రశ్నించారు. ఏపీఎండీసీ ద్వారా మే 2025లో సేకరించిన రూ. 9,000 కోట్ల ఎన్‌సీడీ నిధులను ప్రభుత్వం అక్రమంగా తన రెవెన్యూ ఖర్చుల కోసం వాడుకుందని జగన్ ఆరోపించారు. ఎటువంటి ఆస్తుల సృష్టి జరగకుండానే ఈ నిధులను మళ్లించారని, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఎన్‌సీడీ హోల్డర్లకు రాష్ట్ర కన్సోలిడేటెడ్ ఫండ్ యాక్సెస్ కల్పించారని మండిపడ్డారు. ఈ నిధులు కేవలం లెక్కలు సర్దుబాటు చేసేందుకే నాన్-టాక్స్ రెవెన్యూగా చూపించారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి విధానపరమైన పక్షపాతం, అవినీతి వల్ల వచ్చిందేనని జగన్ విమర్శించారు. ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అవాస్తవ వృద్ధి రేట్లను ప్రకటిస్తోందని, అప్పులు సేకరించడానికి అనారోగ్యకరమైన, రాజ్యాంగ విరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటోందన్నారు. గత రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని, ఇది భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఆయన హెచ్చరించారు.

### పరిశ్రమల శక్తి కేంద్రం
## రాయలసీమ

మొదటి పేజీ తరువాయి...

శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా తిరుపతి, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలు పారిశ్రామిక హబ్‌లుగా మారుతున్నాయి.

ప్రఖ్యాత 'బుల్లెట్' మోటార్‌సైకిల్ ఇకపై నేరుగా తిరుపతి జిల్లా నుంచే వినియోగదారుల ముందుకు రానుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ తిరుపతిలో తన 'బుల్లెట్' మోటార్‌సైకిళ్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. దీని కోసం రూ. 2,508 కోట్ల పెట్టుబడిని వెచ్చించనుంది. రానున్న రోజుల్లో ఏపీలో జోరుగా బులెట్ రయ్ రయ్ మంటూ సాగుతుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్ల ప్రాథమిక పెట్టుబడితో భారతదేశంలోనే మొట్టమొదటి డ్రోన్ సిటీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. డ్రోన్ల తయారీ, పరిశోధన , పరీక్షలు, శిక్షణ అన్నీ ఒకే చోట లభించేలా ఈ హబ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దీని ద్వారా దాదాపు 40 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. రాయలసీమ దేశానికే రక్షణ సీమగా నిలిచేలా అడుగులు పడ్డాయి. రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన ఐదో తరం యుద్ధ విమానాల తయారీకి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి వేదికైంది. అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శనివారం రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు చంద్రబాబు చేతుల మీదుగా భూమిపూజ జరిగింది.

కడప జిల్లాలో హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు : శ్రీ సత్యసాయి జిల్లాలో రూ. 51,000 కోట్ల పెట్టుబడితో ఒక సౌర విద్యుత్ ప్లాంట్‌ను, బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. మరోవైపు కడప జిల్లాలో అదానీ సంస్థ రూ. 12,000 కోట్ల పెట్టుబడితో ఒక హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది.

రాయలసీమలో భారీ సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకానుంది. రూ.10,239.78 కోట్ల పెట్టుబడితో ఆర్‌ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ శ్రీసత్యసాయి జిల్లాలో దీన్ని ఏర్పాటు చేయనుంది. పవర్ డివైజ్‌ల కోసం ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సదుపాయం, అత్యాధునిక సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ తయారీ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటుచేయనుంది. ఇప్పటికే ముంబయిలో మొదటి ఓఎస్‌ఏటీ సదుపాయాన్ని పైలట్ విధానంలో సంస్థ నిర్వహిస్తోంది. దీంతోపాటు అణుశక్తి విభాగానికి సరఫరా చేసే రక్షణ పరికరాలూ తయారుచేస్తోంది.




## ముందుంది.. బాదుడు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ రంగ చమురు కంపెనీల నష్టాల్లో కేవలం 10 శాతం మాత్రమే రికవరీ అయింది. ప్రస్తుతం కంపెనీలు పెట్రోల్‌పై లీటరుకు రూ.11-20, డీజిల్‌పై రూ.30-39 వరకు నష్టాన్ని భరిస్తున్నాయి. దీనివల్ల వీటికి రోజుకు రూ.500 నుండి రూ.1,000 కోట్ల మేర నష్టం వాటిల్లుతోంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి ఈ మొత్తం నష్టాలు రూ.1 లక్ష కోట్లు దాటే ప్రమాదం ఉంది. ఇది గత ఏడాది లాభాలను సైతం తుడిచిపెట్టేలా ఉంది. చమురు సంస్థలు ఈ భారీ నష్టాల నుంచి బయటపడాలంటే ఇంధన ధరలను మరో 20-30% (అంటే లీటరుకు రూ.20-30) పెంచడం అనివార్యంగా కనిపిస్తోంది. ఇంత పెద్ద మొత్తంలో భారాన్ని ఒకేసారి ప్రజలపై మోపకుండా, క్రమంగా ధరలు పెంచుతామని కేంద్ర పెట్రోలియం మంత్రి హరదీప్ సింగ్ సంకేతాలిచ్చారు. ఏదేమైనా, ఈ ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. తద్వారా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడి బడ్జెట్ తలకిందులు కానుంది. ఈ నేపథ్యంలో ఇంధన ఆదా, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడకం వైపు ప్రజలు మళ్లాలని ప్రభుత్వాలు కోరుతున్నాయి.



## వెండి దిగుమతిపై బ్యాన్

మొదటి పేజీ తరువాయి...

తాజా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన నిబంధనలు తక్షణమే అమలులోకి వస్తాయని స్పష్టం చేసింది. తాజా నోటిఫికేషన్ ప్రకారం.. దేశంలోకి వెండి బార్స్ , అన్‌రాట్ సిల్వర్ సిల్వర్ పౌడర్‌తో కూడిన సెమీ-మాన్యుఫాక్చర్డ్ వెండి దిగుమతులను 'ఫ్రీ' (ఉచిత/ఎలాంటి అనుమతులు అవసరం లేని) కేటగిరీ నుంచి 'రిస్ట్రిక్టెడ్' (పరిమిత) కేటగిరీలోకి మార్చారు. దీని అర్థం ఇకపై విదేశాల నుంచి భారతదేశంలోకి వెండిని పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవాలంటే వ్యాపారులు లేదా సంస్థలు కచ్చితంగా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి లేదా లైసెన్స్ పొందడం విధిగా మారింది.

## నేటి నుంచి
## మోదకొండమ్మ జాతర

### పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు

(అల్లూరి జిల్లా - జయజయహే)

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో 17నుండి 19 వరకు జరిగే శ్రీ మోదకొండమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలకు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. ఈరోజు పాడేరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోదకొండమ్మ జాతరకు వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఈసారి 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గుడి పరిసరాలు, భక్తుల రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, శతకం పట్టు ప్రాంగణంలో సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా ఉంటుందని చెప్పారు. ట్రాఫిక్ మళ్లింపు, తాగునీరు, వైద్య శిబిరాల కోసం ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచామని స్పష్టం చేశారు. భక్తులు పోలీసులకు సహకరించాలని, ఏదైనా సమస్య ఉంటే 100 లేదా దగ్గర్లోని పోలీసు అధికారిని సంప్రదించాలని కోరారు.

## అండమాన్‌కు నైరుతి!

### తీరానికి ప్రవేశించిన రుతుపవనాలు
### నాలుగు రోజుల్లో మరింత విస్తరణ
### జూన్ రెండో వారానికి తెలుగు రాష్ట్రాలకు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. అండమాన్ సముద్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్‌లోని కొన్ని ప్రాంతాలు, నికోబార్ దీవులకు రుతు పవనాలు విస్తరించాయి. ఆగ్నేయ అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లోనూ ఋతుపవనాలు ప్రవేశించాయి. మరో మూడు నాలుగు రోజుల్లో మరింత విస్తరించేందుకు అనుకూల పరిస్థితులున్నాయని ఐఎండీ ప్రకటించింది ఐఎండి. ఆగ్నేయ అరేబియా ప్రాంతంలోని మరికొన్ని ప్రాంతాలు, నైరుతి ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ దీవులు అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, తూర్పు బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు ప్రవేశించే అవకాశముంది. ఈ నెలలోనే భారతదేశంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది ఐఎండి. మే 26న డేట్ ఫిక్స్ చేసింది. అయితే వాతావరణ పరిస్థితుల దృశ్య ఆ తేదీకి నాలుగు రోజులు అటూ ఇటూగా రుతుపవనాలు కేరళను తాగే అవకాశం ఉండవచ్చని ఐఎండి వివరించింది. అంటే మే చివరి వారంలో ఎప్పుడైనా కేరళలోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయన్న మాట. సాధారణంగా భారత వాతావరణ అంచనా ప్రకారం ప్రతిఏటా జూన్ 1 నాటికి కేరళలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. అక్కడ నుంచి ఉత్తరాదిశగా కదులుతూ విస్తరిస్తాయి. దేశంలోనే మిగతా ప్రాంతాలకు క్రమంగా ఉతుపవనాలు చేరుకుంటాయి. కేరళలో రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి రుతుపవనాలు విస్తరించినచోట వర్షాలు కురవడం మొదలవుతుంది. ఈ వర్షాల సీజన్ సెప్టెంబర్ వరకు ఉంటుంది. రుతుపవనాలు కేరళలో ప్రవేశించిన తర్వాత.. ఏపీలోని రాయలసీమకు విస్తరిస్తాయి. ఆ తర్వాత రాష్ట్రమంతా అలాగే.. తెలంగాణకు విస్తరించి వర్షాలు కురిపిస్తాయి. ఐఎండి అంచనాన్ని బట్టి.. ప్రతిఏటా సాధారణంగా రుతుపవనాలు జూన్ 1న తాకిన తర్వాత పది రోజులకు ఏపీలోకి ప్రవేశిస్తాయని అంచనా. కానీ ఈసారి ఈ నెలాఖరు లోగానే కేరళకు తాకితే.. అప్పటి పరిస్థితులను బట్టి ఏపీలోకి ఇప్పుడు ప్రవేశిస్తుందనేది ఒక అంచనాకు వస్తారు వాతావరణ శాఖ అధికారులు. ప్రస్తుతానికి కేరళకు తాకే తేదీని ప్రకటించారు. ఏటా జూన్ ఒకటో తేదీ కల్లా కేరళను ఋతుపవనాలు తాకాల్సి ఉన్నప్పటికీ.. గతేడాది ఎనిమిది రోజులు ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. వాతావరణంలో అనుకూల పరిస్థితులకు తోడు అరేబియా మహాసముద్రంలో అల్పపీడన వ్యవస్థ కూడా ఎర్లీ మాన్‌సూన్ కు కారణమైంది. 2009 తరువాత వారం రోజులు ఎర్లీగా గతేడాది మాన్సూన్ కేరళలోకి ప్రవేశించింది. ఆ సమయంలో కేరళలో భారీ నుంచి అతిభారి వర్షాలు బలమైన ఎదురుగాలతో కొన్ని రాష్ట్రాలకు ఐఎండి రెడ్ అలర్ట్ కూడా ప్రకటించింది. అండమాన్ తీరంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశంతో.. మరికొద్ది రోజుల్లోనే వర్షాల సీజన్ భారత్ లో మొదలైనట్టే.. ఆ తర్వాత కేరళకు రుతుపవనాలు తాకుతాయి. వాతావరణ పరిస్థితులు బట్టి విస్తరించాక భారత భూభాగంలో.. తొలకరి పలకరిస్తుంది. ఆ తర్వాత కొద్దిరోజులకు రెండు తెలుగు రాష్ట్రాల్లో రుతుపవనాలు విస్తరించి వర్షాలు కురుస్తాయి. వాతావరణ శాఖ చల్లటి కబురు అందించడంతో అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు.

# భూమి మీద ఉన్న సమస్త జీవరాశినీ కాపాడటమే మన బాధ్యత






**ఏ జీవి అంతరించినా మానవాళి కే నష్టం**

**మనం తినే పండ్ల విత్తనాల తో సామాజిక వనాలు పెంచాలి**

**ప్రకృతి ఆధారంగా పంటలు పండించాలి, అవే భుజించాలి - జెవి రత్నం**

**విశాఖపట్నం (జయ జయహే)**

భూమి మీద ఉన్న సమస్త జీవరాశినీ కాపాడటమే మన బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం సబ్బవరం లో దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం లో ఎన్ సి సి 13వ బెటాలియన్ లెఫ్ట్ నెంట్ కల్నల్ నీరజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి మీద ఏ జీవి అంతరించినా మానవాళి కే నష్టం అని వివరించారు. మనం తినే దేశీయ పండ్ల విత్తనాల తో సామాజిక వనాలు పెంచాలని కోరారు. ఏ విత్తనం ఊరికే బయట పడవేయరాదన్నారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించాలి, అవే భుజించాలి అని కోరారు. ఇంత వరకూ శాస్త్రవేత్తల పరిశోధనలో ఒక్క భూ గోళం మీద మాత్రమే జీవజాతులు ఉన్నాయి అని వివరించారు. ఈ జీ జాతుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎన్ సి సి క్యాడెట్లతో విభిన్న వన్యప్రాణుల మాస్క్ లు ఇచ్చి ఆయా వన్యప్రాణుల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

ఈ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ స్వర్ణిం ప్రభాత్, సుభేదార్ మేజర్ డి రాజేంద్రన్, సుభేధార్ ఆర్డినరీ కెప్టెన్ జి శ్రీధర్, మేజర్ కళ్యాణ్ అశోక్, లెఫ్ట్ నెంట్ వి సన్యాసి నాయుడు, లెఫ్ట్ నెంట్ ఉదయ్ కిరణ్, చీఫ్ ఆఫీసర్ లత, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయ కర్త జె రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు.



# స్థానిక ఎన్నికలలో పోటీకి సన్నద్ధం కావాలి

**అరకు పార్లమెంటు ఇంచార్జ్**

**కొయ్యూరు :(జయ జయహే)న్యూస్ మే 17**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కొరకు జనసేన మండల నాయకులు సిద్ధం కావాలని అరకు పార్లమెంటు ఇంచార్జ్, జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ ఒంపురు గంగలయ్య దిశా నిర్దేశం చేశారు. కొయ్యూరు మండల కేంద్రానికి శనివారం విచ్చేసిన ఆయన మండల నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలు సందర్భంగా కొయ్యూరు మండలంలో ఈనెల 23వ తారీఖున కార్యకర్తలతో భారీ సమావేశం నిర్వహించబోతున్నామని, ఈసమావేశానికి మండల జనసేన కార్యకర్తలు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయడానికి మండల నాయకులు సన్నద్ధం కావాలని, పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యే విధంగా మండల నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు. ఎలియన్స్ లో భాగంగా అత్యధిక స్థానాలకు స్థానిక ఎన్నికలలో జనసేన పార్టీ పోటీ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ సభ్యులు వీర వెంకట్, వంతల సుబ్బారావు, జనసేన మండల ప్రెసిడెంట్ గూడెం లక్ష్మణరావు,జనసేన ప్రధాన కార్యదర్శి గూడెపు శేషబాబు, జనసేన కార్యనిర్వహణ కార్యదర్శి సుధీర్ బాబు, తదితర జన సైనికులు పాల్గొన్నారు.




# తెలుగు రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల అమలు వేగం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ వినియోగాన్ని ఆధునీకరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 1, 2026 నుండి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మున్సిపల్ సంస్థల్లో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను తప్పనిసరిగా అమలు చేయనుంది.

దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో ఇప్పటికే సుమారు 1.17 లక్షల కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కొనసాగుతోంది. విద్యుత్ బకాయిలను తగ్గించడం, వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించడం, బిల్లింగ్‌లో పారదర్శకత తీసుకురావడం ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు.

ఏప్రిల్ 2026లో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ స్మార్ట్ మీటర్ల నిబంధనలను సవరించడంతో, ప్రీపెయిడ్ విధానం ఇప్పుడు ఐచ్ఛికంగా మారింది. వినియోగదారుడు కోరుకుంటే ప్రీపెయిడ్ విధానాన్ని ఎంచుకోవచ్చు, లేదంటే సాధారణ పోస్ట్‌పెయిడ్ విధానంలోనే కొనసాగవచ్చు.

స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ వినియోగాన్ని మొబైల్‌లోనే ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ప్రీపెయిడ్ విధానాన్ని ఎంచుకున్నవారు అవసరానికి అనుగుణంగా రీచార్జ్ చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే మీటర్ రీడింగ్‌లో మానవ తప్పిదాలు తగ్గి, బిల్లింగ్ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుంది.

డిఈ నారాయణ అప్పారావు మాట్లాడుతూ...

“స్మార్ట్ మీటర్ల అమలుతో విద్యుత్ వినియోగంలో క్రమబద్ధీకరణ వస్తుంది. వినియోగదారులు తమ ఖర్చులను తాము సులభంగా పర్యవేక్షించగలుగుతారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మొదట అమలు చేసి, అనంతరం దశలవారీగా ప్రజలకు కూడా విస్తరించనున్నాం. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కోసం వినియోగదారులు అదనంగా ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం మరియు డిస్కంల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది,” అని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల ఎలక్ట్రికల్ డిఈ నారాయణ అప్పారావు తెలిపారు.

స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



# దేశసేవకు ప్రేరేపించేదే నిజమైన ధర్మం

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి**

**కర్నూలు (జయ జయహే)**

ధర్మమంటే కేవలం పూజలు, వ్రతాలు మాత్రమే కాదని, మన దేశం, సమాజం, ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలనే బాధ్యతను కలిగించేదే నిజమైన ధర్మమని, దేశం కోసం త్యాగ భావాన్ని, ప్రజల కోసం జీవించడం నేర్పేదే సనాతన ధర్మమని, మాతృభూమిని గౌరవించని భక్తి అసంపూర్ణమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలం, వేముగోడు గ్రామంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆలయ అర్చకులు మల్లిఖార్జునయ్య గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ స్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు యాగంటి ఈశ్వరరెడ్డి, హార్మోనిస్థు జి. ఈరన్న, డక్కీ మాష్టారు ఎ. వీరన్న, తబలిష్ఠ కె. అర్జున్, వై.రాజారెడ్డి, బి. చిన్నయ్య, రంగన్న, ఎ. వినోద్, మద్దిలేటి, సి. ఉరుకుంద, యం. లక్ష్మణ్ణ, జి.రామాంజనేయులు, రాఘవేంద్రతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







# శివాజీ పార్కులో ‘స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర’ నిర్వహణ

**విశాఖపట్నం :(జయ జయహే)**

చెత్త సేకరణకు ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని.. ప్రజలకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చా రాము రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు వ్యర్థాల నియంత్రణ పై అవగాహన కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం.. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ మూడవ శనివారం సందర్భంగా శివాజీ పార్క్ లో .. “స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర - మేక్ అవర్ ఆంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్” అనే కార్యక్రమం నిర్వహించారు. సంస్థ నిర్వహించిన కార్యక్రమానికి కి విశిష్ట అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చా రాము రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని ప్రస్తావించారు. అదేవిధంగా ప్లాస్టిక్ నియంత్రణ కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య సిబ్బందికి బుచ్చరామిరెడ్డి నేతృత్వంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్,అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్, సీఎంహెచ్ఓ, ఏఎంహెచ్ఓ,సానిటరీ ఇన్స్పెక్టర్ జీవీఎంసీ సిబ్బందితో పాటు స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బిజెపి ఇంచార్జ్ రోడ్డుల పరిశీలన

**అనంతగిరి, జయ జయహే :**



అనంతగిరి మండలం, మారుమూల నాలుగు పంచాయతీలు లో అరుకు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బిజెపి నాయకులు పాంగి రాజేరావు మారుమూల నాలుగు పంచాయతీలలో విస్తృతంగా పర్యటించారు గ్రామాల్లో రోడ్ల పరిస్థితి తాగునీటి, సమస్యలు మౌలిక వసతుల కొరతపై ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు మంచినీటి సౌకర్యాలు అత్యంత అవసరమని తెలిపారు పలు గ్రామాల్లో చెదిరిపోయిన రహదారుల ఆ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహిళలు తాగునీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అనంతరం పెదకోట నుండి జాలాడవరకు మంజూరైనటువంటి మెయిన్ రోడ్డు పనులు వేగవంతంగా మొదలుపెట్టలని లేని పక్షాన కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళవలసి వస్తుందని కాంట్రాక్టర్ ని హెచ్చరించారు. ఏళ్ల తరబడిన జీడిమెట్లు బోనూరు గంగవరం రోడ్డు పని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పూర్తి చేయని పక్షాన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన యువతను నాశనం చేస్తున్న కూటమి సర్కార్

**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సురేష్ కుమార్**

**స్కిల్ గేమ్ ల పేరిట ప్రజల జేబులు గుల్ల**

**కాయ్ రాజా కాయ్ గా పాడేరు నడిబజార్**

**పేకాటలు, గుళ్ళాటలకు అధికారిక పర్మిషన్లు**

**మోదకొండమ్మ అమ్మ వారి ఉత్సవాల పేరిట కూటమి ఆటలు**

**పాడేరు, మే 16, జయ జయహే :**

పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మ వారి ఉత్సవాలను రాష్ట్ర జాతర పేరుతో రూ. 2కోట్లతో ప్రపోజల్స్ పంపించి అంతకు రెండింతలు స్థానిక ప్రజల నుంచి చందాల రూపంలో ఇబ్బడిముబ్బడిగా వసూళ్లకు పాల్పడి గిరిజన యువతను కూటమి నేతలు నాశనం చేస్తున్నారని వైసీపీ అల్లూరి జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమాయక గిరిజన ప్రజలను పీల్చి పిప్పి చేయాలని “స్కిల్ గేమ్”ల పేరిట ప్రజల జేబులను గుల్ల చేస్తూ సొమ్మును దండుకుంటున్నారన్నారు. ఇక్కడ లా అండ్ ఆర్డర్ ఉందా లేదా... ప్రభుత్వం పనిచేస్తుందా లేదా...కేవలం పై స్థాయి నుండి క్రింది స్థాయి వరకూ అందరూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మాదిరిగా ఊడిగం చేస్తున్నారా అన్నది గిరిజన ప్రజలకు అర్థం కావటం లేదన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని గిరిజన ప్రజల నుండి, గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసుకుని పండక్కి వచ్చే బంధువులకు కనీసం గంజిమెతుకులైనా పెడదామని దాచుకున్న సొమ్మును పేకాటల పేరిట, గుల్లాటల పేరిట, స్కిల్ గేమ్ ల పేరిట జేబులు గుల్ల చేయటం ఈ జిల్లా కలెక్టర్ కూ, జిల్లా ఎస్పీకి తగునా అని ప్రశ్నించారు. మీరు అధికారికంగా పర్మిషన్ ఇచ్చారా లేక మీరు పర్మిషన్ ఇవ్వలేదా లేక అనధికారికంగా పర్మిషన్



తీసుకున్నట్టు నటించి ఈ “స్కిల్ గేమ్”లను నడిబజారులో ఆడిస్తున్నారా ప్రజలకు వెంటనే తెలియ జేయాలని అధికారులను డిమాండ్ చేశారు. పేదలుంటారు... రెక్కాడితే కానీ డొక్కాడని ప్రజలుంటారు...వారి జేబులు గుల్ల చేయకూడదనే కనీస జ్ఞానం పెద్ద చదువులు చదువుకున్న అధికారులకు ఎందుకులేదో అర్థం కావటం లేదన్నారు. మీకున్న పరిజ్ఞానాన్ని పదిమందికి కూడు పెట్టేలా ఉండాలే కాని కూడు లాగేసుకునేలా ఉండకూడదనే విషయాన్ని గుర్తుపెట్టుకుని పరిపాలన అందిస్తే బావుంటుందని సలహా యిచ్చారు. గిరిజన ప్రజానీకం తరపునా బేషరతుగా స్కిల్ గేమ్ లు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసారు. నాటుకోళ్ళు, మేకపోతులు, చికెన్ మటన్ లు తినక్కరలేదు కనీసం గంజినీళ్ళైనా పేద ప్రజలకు తాగనివ్వండి అంటూ జిల్లా అధికారులను డిమాండ్ చేశారు.



### శీర్షిక: నాతోనే !!!

గాయాల గాథలన్నీ మోసుకుంటా నాతోనే
జీవిత జాడలన్నీ దాచుకుంటా నాతోనే

ఎవరూ తోడులేరని గుండె పలికిన వేళ
నా దారి దీపమై నే వెలుగుకుంటా నాతోనే

కష్టాల కడలిలోన నిలువ నేర్చిన ప్రాణం
నష్టాల పారమంతా చేర్చుకుంటా నాతోనే

మగ్గం మౌనమైనా మది మసకవ్వనీయక
చిరిగిన ఆశదారాలు నేసుకుంటా నాతోనే

కమ్మరి కుమ్మరి చెమట తెలిపిన సత్యమంత
మనిషి విలువలన్నీ కాపాడుకుంటా నాతోనే

"కొణపల" స్వరమది లోపల పలికినప్పుడే
నా బ్రతుకు చరిత్రంతా రాసుకుంటా నాతోనే

డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్

# ఉర్మిళ... నిశ్శబ్ద శక్తి మరియు భావోద్వేగ సహనానికి ప్రతీక

**రామాయణంలో ఉర్మిళ పాత్ర ఎంతో సున్నితమైనది, కానీ అంతే గాఢమైనది కూడా. ఆమె లక్ష్మణుని భార్యగా, జనకుని కుమార్తెగా, సీతకు సోదరిగా ప్రసిద్ధి పొందినా, ఆమె జీవితం మనకు నిశ్శబ్దంలో దాగిన స్త్రీ శక్తిని గుర్తుచేస్తుంది. ఉర్మిళ యొక్క సహనం, త్యాగం, మరియు అంతర్గత బలము రామాయణంలో గాఢమైన మానవీయ భావాలను ప్రతిబింబిస్తాయి. ఆమె మనకు తెలియజేసే నీతి ఏమిటంటే: " నిశ్శబ్దం అనేది బలహీనత కాదు; అది భావోద్వేగ స్థైర్యానికి రూపం ."**




#### త్యాగానికి ప్రతీక -- ఉర్మిళ

శ్రీరాముడు వనవాసానికి వెళ్ళినప్పుడు, లక్ష్మణుడు తన అన్నతో పాటు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. ఆ సమయంలో ఉర్మిళ తన భర్తను నిలువరించలేదు, అడగలేదు, కానీ నిశ్శబ్దంగా తన బాధను లోనికి ముంచుకుంది. ఆమె లక్ష్మణునితో ఇలా చెప్పినట్లు కథల్లో సూచిస్తారు: "నీ ధర్మమే నీ దారి. నేను నా ధర్మాన్ని ఇక్కడ నిలబెడతాను." ఈ మాటల వెనుక ఉన్న ఆత్మసమర్పణ మరియు భార్యా ధర్మం యొక్క ఆత్మార్థం మనసును కదిలిస్తుంది. ఆమె వనవాసం వెళ్ళకపోయినా, తన భర్త లేని వనవాసాన్ని భరించింది. ఉర్మిళ త్యాగం మనకు తెలియజేసే విషయం ఏమిటంటే: త్యాగం ఎప్పుడూ బహిరంగంగా ఉండాల్సిన అవసరం లేదు; నిశ్శబ్దంలోనూ అది గొప్పదే .



#### నిశ్శబ్ద బలం మరియు భావోద్వేగ స్థైర్యం

ఉర్మిళ జీవితంలో ఉన్న నిశ్శబ్ద శక్తి అనేది ఆమె అత్యంత గొప్ప గుణం. ఆమె బాధను చెప్పుకోలేదు, కానీ తన భర్తకు మానసిక శక్తిగా నిలిచింది. లక్ష్మణుడు రాత్రిపూట నిద్రపోకుండా రాముడికి సేవ చేస్తుంటే, కథల ప్రకారం ఉర్మిళ తన భర్త బదులు నిద్రను స్వీకరించింది, తద్వారా లక్ష్మణుడు నిరంతర సేవ చేయగలిగాడు.

ఇది కేవలం కథలోని ప్రతీక కాదు; ఇది భార్యా సహనం మరియు నిశ్శబ్ద మద్దతు యొక్క చిహ్నం. ఇదే నిజమైన స్త్రీ బలం --- కనిపించని, కానీ స్థిరంగా నిలిచే శక్తి.

#### ఆధునిక ప్రపంచానికి ఉర్మిళ పాఠం

ఉర్మిళ పాత్ర నేటి సమాజంలో మహిళల జీవితానికి అత్యంత ప్రాసంగికం.

నిశ్శబ్దంలో దాగిన స్త్రీ శక్తి: మనం తరచుగా నాయకత్వం, శౌర్యం, లేదా విజయాన్ని బహిరంగంగా చూస్తాం. కానీ కుటుంబాన్ని, సంబంధాలను నిలబెట్టేది తరచుగా నిశ్శబ్దంగా పనిచేసే స్త్రీలే. ఉర్మిళ వంటి మహిళలు మనకు గుర్తుచేస్తారు --- " అనుభవాలను తట్టుకోవడం కూడా ఒక బలం ."

భావోద్వేగ స్థైర్యం: నేటి ప్రపంచంలో ఒత్తిడులు, దూరాలు, మరియు అనిశ్చితి మధ్య స్త్రీలు కుటుంబానికి అడ్డుగా నిలుస్తున్నారు. ఉర్మిళ మనకు నేర్పుతుంది --- శాంతంగా బాధను భరించడం అనేది బలహీనత కాదు, అది ప్రేమలోని పరాకాష్ట.

త్యాగానికి విలువ: ఉర్మిళ తన జీవితంలో ఏ ప్రశంసకూ, కీర్తికీ ఆశపడలేదు. ఆమె త్యాగం నిష్కామమైనది. ఇది మనకు గుర్తు చేస్తుంది: " నిజమైన సేవ అనేది గుర్తింపుకోసం కాదు; ప్రేమ మరియు ధర్మం కోసం ."

#### నేటి స్త్రీకి ఉర్మిళ సందేశం


ఉర్మిళ మనకు ఒక నిశ్శబ్ద విప్లవం చూపిస్తుంది: "శక్తి ఎప్పుడూ శబ్దంలో ఉండదు; అది సహనంలో కూడా ఉంటుంది." నేటి మహిళలు పని, కుటుంబం, బాధ్యతల మధ్య సమతుల్యం సాధించడానికి శ్రమిస్తున్నారు. ఉర్మిళలాంటి పాత్రలు వారికి ప్రేరణగా నిలుస్తాయి. " నిశ్శబ్దంగా పోరాడిన వారు కూడా మహత్తరులు ," అనే విషయాన్ని ఆమె జీవితం నుంచి మనం గ్రహించవచ్చు.

ఉర్మిళ రామాయణంలో ఎక్కువగా మాట్లాడని పాత్ర అయినప్పటికీ, ఆమె స్త్రీశక్తి యొక్క నిశ్శబ్ద గీతం. ఆమె జీవితం మనకు ప్రేమ, ధర్మం, మరియు సహనానికి నూతన నిర్వచనం ఇస్తుంది. ఆమె కథ మనకు ప్రధానంగా రెండు విషయాలను చెబుతుంది:

"బలం అనేది శబ్దం మాత్రమే కాదు; అది మనసులోని స్థిరత్వం కూడా."

"త్యాగం అనేది బహిరంగ చర్య మాత్రమే కాదు; అది నిశ్శబ్ద ధర్మం కూడా."

ఉర్మిళ మనకు చూపించింది --- స్త్రీ బలం శబ్దంలో కాదు, నిశ్శబ్ద సహనంలో ఉందని.



ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు

## ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న

# సోషల్ మీడియా రీల్స్ పిచ్చి

## సమాచార విప్లవమా? సంక్షోభమా?

(పుట్టా శ్రీనివాస్ రావు)

**నేటి కాలంలో స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు.. ప్రపంచమంతా మన గుప్పిట్లో ఉన్నట్టే. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటివి వినోదంతో పాటు ఎంతో సమాచారాన్ని అందిస్తున్నాయి. అయితే, ఇదే సమాచారం ఇప్పుడు ప్రాణసంకటంగా మారుతోంది. కేవలం 'లైక్స్', 'వ్యూస్' కోసం ఎవరో చేసే వీడియోలను, రీల్స్‌ను గుడ్డిగా నమ్మి అనుసరిస్తూ సామాన్య ప్రజలు తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు సమాచారం కోసం పుస్తకాలు, పత్రికలను ఆశ్రయించే వారు.. ఇప్పుడు సెల్ ఫోన్ లో కనిపించే ప్రతిదీ నిజమని నమ్మి 'డిజిటల్ సంక్షోభం'లో చిక్కుకుంటున్నారు.**



#### నాటి.. నేటి పరిస్థితులు:

ఒకప్పుడు ఏదైనా ఒక చిట్కా లేదా సమాచారం బయటకు రావాలంటే దాని వెనుక ఎంతో అనుభవం లేదా శాస్త్రీయత ఉండేది. కానీ నేడు టెక్నాలజీ పెరగడంతో ఎవరికి వారు 'కంటెంట్ క్రియేటర్స్' అయిపోయారు. వంటలు, వైద్యం, ప్రయాణాలు.. ఇలా ఏ రంగంలోనైనా అవగాహన లేని వారు సైతం కెమెరా ముందుకొచ్చి సలహాలు ఇచ్చేస్తున్నారు. బాధ్యతాయుతమైన సమాచారం కంటే, సంచలనం సృష్టించడమే లక్ష్యంగా వీడియోలు రూపుదిద్దుకుంటున్నాయి.

#### ఉపయోగాలు - నష్టాలు:

ఉపయోగాలు: ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న విషయాలను తక్షణమే తెలుసుకోవచ్చు. నిపుణుల సలహాలు, నైపుణ్యాలను నేర్చుకోవడానికి ఇది ఒక గొప్ప వేదిక.

నష్టాలు: దీనివల్ల సమాచారం కంటే 'తప్పుడు సమాచారం' వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఒక అబద్ధాన్ని పదిమంది చూస్తే అది నిజమని నమ్మే ప్రమాదం ఉంది. దీనివల్ల శారీరక ఆరోగ్యమే కాదు, మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది.

#### వైద్య శాస్త్రం హెచ్చరిక:

సోషల్ మీడియాలో చూసి స్వయం వైద్యం చేసుకోవడం అత్యంత ప్రమాదకరం. ముఖ్యంగా ప్రకృతిలో లభించే ప్రతి మొక్క ఆరోగ్యానికి మంచిదని ప్రచారం చేయడం వల్ల ప్రజలు విషపూరిత మొక్కలను కూడా ఆహారంగా తీసుకుంటున్నారు. ఉమ్మెత్త వంటి మొక్కల్లో ఉండే ఆల్కలాయిడ్లు నాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తాయి. తక్షణ విరుగుడు లేని ఇలాంటి పదార్థాల పట్ల వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### జాగ్రత్తలు - సూచనలు:

గుడ్డిగా నమ్మకండి: సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వీడియో నిజం కాదు. ముఖ్యంగా ఆహారం, ఆరోగ్యానికి సంబంధించిన విషయాల్లో నిపుణుల సలహా తప్పనిసరి.

మూలాలను తనిఖీ చేయండి: వీడియో చేసే వ్యక్తికి ఆ రంగంలో అర్హత ఉందో లేదో గమనించండి.

ప్రయోగాలకు దూరంగా ఉండండి: కొత్త రకమైన ఆహార పదార్థాలు, మందుల విషయంలో ప్రయోగాలు చేయకండి.

#### భవిష్యత్ ప్రణాళిక:

రాబోయే కాలంలో ఈ డిజిటల్ మాయాజాలం నుండి ప్రజలను కాపాడాలంటే ప్రభుత్వాలు మరియు స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ స్థాయి వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. పాఠశాల స్థాయి నుండే 'డిజిటల్ లిటరసీ' (డిజిటల్ విజ్ఞానం) పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలి. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ఛానెల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలి.

#### ఉదాహరణ: ఉమ్మెత్త పువ్వు ఘటన - ఒక హెచ్చరిక

ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఒక కుటుంబం అమ్మవారి జాతర కోసం స్వగ్రామమైన ఎర్రంపాలెం వెళ్లి, అక్కడ ఇన్‌స్టాగ్రామ్ రీల్‌ను చూసి 'ఉమ్మెత్త పువ్వు'తో కూర వండుకుని తినడం సంచలనం సృష్టించింది. ఆ వీడియోలో చెప్పిన తప్పుడు సమాచారాన్ని నమ్మి గంగాభవాని, వీరలక్ష్మి, వీరబ్బు, జయలక్ష్మి అనే నలుగురు కుటుంబ సభ్యులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. కేవలం వినోదం కోసం చేసే వీడియోలు, అవగాహన లేని వ్యక్తులు ఇచ్చే సలహాలు ఎంతటి ప్రమాదానికి దారితీస్తాయో ఈ ఘటన అద్దం పడుతోంది.

సోషల్ మీడియా ఒక పదునైన కత్తి లాంటిది. దానిని విజ్ఞానానికి వాడితే ఉపయోగం, అజ్ఞానంతో వాడితే నష్టం. ఆరోగ్యం, ప్రాణం అనేవి తిరిగిరావు. ఏదైనా విషయాన్ని ఆచరించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి లేదా నిపుణులను సంప్రదించండి. అనవసర ప్రయోగాలు చేసి అష్ట కష్టాలు పడకండి.

## మధుమేహ నియంత్రణలో

# నూతన ఆవిష్కరణలు

(సి.హెచ్.ప్రతాప్)

మధుమేహ నియంత్రణలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు నేడు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఈ వ్యాధిని అదుపు చేయడంలోనే కాకుండా, రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. స్టెమ్ సెల్ చికిత్స, శరీరంలో అమర్చగలిగే పరికరాలు, స్మార్ట్ ఇన్సులిన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పద్ధతులు మరియు సూది అవసరం లేని రక్తపరీక్షా విధానాలు ఈ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను సూచిస్తున్నాయి.

ముఖ్యంగా స్టెమ్ సెల్ థెరపీ ద్వారా ప్యాంక్రియాస్‌లోని బీటా కణాలను పునరుద్ధరించడంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. దీనివల్ల టైప్-1 డయాబెటిస్ బాధితుల్లో సహజంగానే ఇన్సులిన్ ఉత్పత్తిని మళ్లీ ప్రారంభించే అవకాశం ఉంది. కొన్ని క్లినికల్ ట్రయల్స్‌లో రోగులు బాహ్య ఇన్సులిన్ అవసరం లేకుండానే సాధారణ జీవితం గడిపిన సందర్భాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి ఇప్పుడప్పుడే అందరికీ అందుబాటులోకి రాకపోయినప్పటికీ, భవిష్యత్తులో ఈ వ్యాధికి శాశ్వత పరిష్కారం దొరుకుతుందనే ఆశను కల్పిస్తున్నాయి.అంతేకాకుండా, ఎం.ఐ.టి వంటి సంస్థలు అభివృద్ధి చేస్తున్న ఇంప్లాంటబుల్ డివైసెస్ శరీరంలో ఉండి నిరంతరం గ్లూకోజ్ స్థాయిలను గమనిస్తూ ఉంటాయి. రక్తంలో చక్కెర శాతం పెరిగినప్పుడు ఇవి వాటంతట అవే అవసరమైన మోతాదులో ఇన్సులిన్‌ను విడుదల చేస్తాయి. దీనివల్ల రోగులు పదేపదే ఇంజెక్షన్లు తీసుకోవాల్సిన బాధ తప్పుతుంది. అలాగే 'స్మార్ట్ ఇన్సులిన్' అనేది రక్తంలోని చక్కెర స్థాయికి అనుగుణంగా స్పందిస్తుంది. చక్కెర తక్కువగా ఉన్నప్పుడు ఇది నిష్క్రియంగా ఉండి, హైపోగ్లైసీమియా ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది రోగులకు ఎంతో సురక్షితమైన మార్గం.

డిజిటల్ రంగంలో ఏ.ఐ అల్గారిథమ్స్ రోగి యొక్క ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ మరియు గ్లూకోజ్ రీడింగ్‌లను విశ్లేషించి, వారికి తగిన ఇన్సులిన్ మోతాదును సూచిస్తున్నాయి. ఇకపై రక్త పరీక్ష కోసం వేలిని సూదితో గుచ్చుకోవాల్సిన పని లేకుండా లేజర్ లేదా స్పెక్ట్రోస్కోపీ ద్వారా గ్లూకోజ్ స్థాయిలను తెలుసుకునే నాన్-ఇన్వాసివ్ పరికరాలు సిద్ధమవుతున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే డయాబెటిస్ పర్యవేక్షణ ఎంతో సులభతరమవుతుంది.వేరబుల్ ప్యాచెస్, మొబైల్ యాప్ సింక్ వంటివి కూడా ఈ పోరాటంలో భాగంగా ఉన్నాయి. భవిష్యత్తులో ఈ సాంకేతికతలు మధుమేహ వ్యాధిగ్రస్తుల పాలిట వరంగా మారనున్నాయి. అయితే వీటి ధర సామాన్యులకు అందుబాటులో ఉండటం, దీర్ఘకాలిక భద్రత వంటి సవాళ్లను ప్రభుత్వం మరియు ఆరోగ్య సంస్థలు అధిగమించాల్సి ఉంది. సరైన నియంత్రణ, వసతుల కల్పనతో ఈ నూతన ఆవిష్కరణలు ప్రతి ఒక్కరికీ మేలు చేస్తాయి.వైద్య రంగంలో వస్తున్న ఈ సాంకేతిక విప్లవం వల్ల మధుమేహం అనేది కేవలం నియంత్రించే వ్యాధిగా కాకుండా, నివారించగలిగే పరిస్థితిగా మారుతుందని మేము బలంగా నమ్ముతున్నాము. శాస్త్ర విజ్ఞానం మనిషికి ఇచ్చే అతిపెద్ద వరం ఆరోగ్యమే. ఆ దిశగా మన అడుగులు పడాలి.

# ఉత్తరాంధ్ర ఇలవేల్పు మోదమాంబ

**అమ్మవారి జాతర ఏర్పాట్లు పూర్తి**

**సతకంపట్టు నుండి ప్రారంభం కానున్న జాతర**

**ఘనంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం**

**అధికార యంత్రాంగం అప్రమత్తం**

**జిల్లా కలెక్టర్ నిషాంతి**

**పాడేరు, మే 16, జయ జయహే**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మూడు రోజులు పాటు రాష్ట్ర పండుగగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు మోదమాంబ అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ నిషాంతి తెలిపారు. అమ్మవారి ప్రాంగణంలో నిర్వహించిన జాతర ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అమ్మవారి జాతర ఆదివారం ఉదయం 6 గంటలకు సతకంపట్టు నుండి ప్రారంభమవుతుందన్నారు. జాతర నిర్వహించడానికి అల్లూరి సీతారామరాజు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌కు డ్రోన్ నిఘా, జన సమూహ నిఘా అనుసంధానం చేశామని ,ముఖ్యంగా విశాఖపట్నం, చింతపల్లి, అరకు లోయ మరియు ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, సందర్శకులు వచ్చే అన్ని ప్రవేశ మార్గాలలో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు.ముఖ్యమైన ప్రదేశాలలో బస్ స్టాప్, జూనియర్ కళాశాల మైదానం, అమ్మవారి గుడి మొదలైన చోట్ల సీసీటీవీలను ఏర్పాటు చేసి భద్రతను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ జీపులను పర్యవేక్షించడానికి ఆర్టివో సిబ్బందితో సమన్వయం చేసుకొని, భక్తులు యాత్రికుల నుండి అధిక లోడ్ అదనపు ప్రయాణ ఛార్జీల వసూలును నివారించడానికి,కార్ పార్కింగ్, వాహనాల రాకపోకల గురించి ప్రజలకు తెలియజేయడానికి అన్ని చోట్లా సూచిక బోర్డులు,ఫ్లెక్సీలను, సిబ్బందిని ఏర్పాటు చేసామన్నారు.అమ్మవారి ఊరేగింపు సమయంలో జన సమూహ నియంత్రణకు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఇరవై నాలుగు గంటలూ భక్తులకు సేవలు అందించడానికి ఆలయ ప్రాంగణంలో నియంత్రణ గదిని ఏర్పాటు చేయడం జరిగిందనినియంత్రణ ఇన్‌చార్జ్‌లను డిఎల్‌పిఓ, ఎపిఇపిడిసిఎల్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య, సమాచార, ఆరోగ్య, పోలీస్ శాఖల నుండి, ఆలయ,ఉత్సవ్ కమిటీ నుండి వ్యక్తులను నియమించామన్నారు.నియంత్రణ గది వ్యక్తులను సులభంగా గుర్తించడానికి వీలుగా, ఉత్సవ్ కమిటీ, ఆలయ కమిటీకి విఐపి పాస్‌లు, వాహన పాస్‌లు, డ్యూటీ పాస్‌లు, ఐడి కార్డులు వంటి అన్ని రకాల పాస్‌లను వేర్వేరు రంగులలో జారీ చేసామన్నారు.భక్తులకు త్రాగునీటితోపాటు, ఆహార సదుపాయాలు కూడా వివిధ ప్రాంతాల్లో స్టాళ్లను ఏర్పాటు చేసి అందిస్తామని భక్తులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.పాడేరు పట్టణం అంతటా నీటి ట్యాంకుల ద్వారా 3 రోజుల పాటు ప్రజలకు నీటిని సరఫరాకు ఏర్పాట్లు చేసామన్నారు.సతకంపట్టు, అమ్మవారి ఆలయం, బస్ స్టాండ్, దుకాణాలు, అంబేద్కర్ సెంటర్ అవసరాన్ని బట్టి ఇతర ప్రదేశాలలో మొబైల్ మరుగుదొడ్లు, ప్రజా మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రతిచోటా ఎల్ ఈ డి డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేసి, జాతర నిరంతర కార్యక్రమాలను భక్తుల వీక్షణ కొరకు వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరిశుభ్రత కొరకు శానిటేషన్ బృందాలను నిరంతరం అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బస్ స్టేషన్లు, పికప్ పాయింట్లు, గెస్ట్ హౌస్‌లు, ఆలయ ప్రాంగణం, శాతకంపట్టు మరియు అవసరమైన ఇతర ప్రదేశాలలో పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాలలో వీధి దీపాలను ఏర్పాటు చేశామన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాత బస్ స్టాండ్, సాయిబాబా ఆలయం వంటి అన్ని ప్రదేశాలలో అవసరమైన అన్ని సామాగ్రితో వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని, అత్యవసర వినియోగం కోసం 3 నుండి 4 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉ ంచామన్నారు.వైద్య శిబిరాలలో పారా మెడికల్ సిబ్బందితో పాటు వైద్య అధికారులు,108 సేవలను ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు.ఉత్సవ దినాలలో గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను, జీవన విధానాలను, ఆహారపు అలవాట్లను, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను తెలియజేసే విధంగా ఆయా సాకులు స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఉత్సవ దినాలలో నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేసామని, ప్రమాదాలు ఉన్నచోట విద్యుత్ తీగలను సరి చేస్తున్నామన్నారు. పండగలో నిర్వహించే బాణసంచా కాల్చే ప్రాంతాలలో జన సమూహం లేని విధంగా ఏర్పాట్లు చేశామని, జిల్లా అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక రచించామన్నారు. ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా త్రాగు నీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించడంతోపాటు, పాడేరు ఆర్టీసీ డిపో నుండి వివిధ రూట్ లలో అధిక మొత్తంలో బస్సులను తిప్పడం జరుగుతుందని ప్రయాణికులు గమనించాలన్నారు. అమ్మవారి జాతరకు అశేష జనవాహిని భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, అమ్మవారి సేవలో తరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఆలయ కమిటీ చైర్మన్ గిడ్డి ఈశ్వరి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటిడిఏ పిఓ ఆదిత్య వర్మ, జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ ఫ్రీ ఆంధ్ర కార్యక్రమం

**చోడవరం, మే16 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకము ఆధ్వర్యంలో శనివారం "ప్లాస్టిక్ ఫ్రీ ఆంధ్ర" స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా మూడో శనివారంలో" ప్లాస్టిక్ ఫ్రీ ఆంధ్ర" కార్యక్రమాన్ని కళాశాల ప్రాంగణము, కళాశాల తోట భాగము మరుగుదొడ్లు పరిశుభ్రంగా విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ శ్రీనివాసరావు, కంప్యూటర్ ఫ్యాకల్టీ కోమల, హేమ గణేష్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఇంటింటికి గ్యాస్ పంపిణీ

**మాడుగుల, మే 16 జయ జయహే**



గత కొద్ది రోజుల నుంచి మాడుగుల తో పాటు మండలంలో కూడా గ్యాస్ పంపిణీ సమస్య తలెత్తుతున్న నేపథ్యంలో అందరికీ గ్యాస్ కంపెనీ కావాలని ఉద్దేశంతో ఇంటింటికి గ్యాస్ అందించి కార్యక్రమాన్ని ప్రారంభించామని స్థానిక తహసిల్దార్ కే రమాదేవి తెలిపారు. శనివారం మాట్లాడుతూ ఇప్పటి వరకు మాడుగుల మండలంలో భారత్ గ్యాస్ తరపున బుక్ చేసుకున్న 320 మందికి సిలిండర్లు అందజేయవలసిందని, అయితే శనివారం ఒక మాడుగుల గ్రామంలోనే 115 సిలిండర్ల వరకు భారత్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ద్వారా లబ్ధిదారులు ఇంటికి పంపించడం జరిగింది అన్నారు. మిగిలిన వారుకి కూడా అందజేయడం జరుగుతుందని రానున్న రెండు మూడు రోజుల్లో మాడుగుల ఈ సమస్య పరిష్కారం కాగలదని చెప్పారు.



## స్వచ్ఛ్ ఆంధ్ర సాధన , నీటి సంరక్షణ మన లక్ష్యం: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి మే 16 జయ జయహే**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిలుపునిచ్చిన స్వార్ధం ఆంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య పనుల్లో జిల్లా ఎస్పీ మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది ప్రస్తుత వేసవి వాతావరణ పరిస్థితులు ఎదుర్కొనేందుకు మరియు గరిష్ట ప్రభావాన్ని సాధించికేందుకు కాలానుగునుగా అనుసరిస్తూ ప్రభుత్వ నిర్దేశించిన వేడిని జయించండి మరియు నీటి సంరక్షణ అంశాలకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా చీపురు పట్టి కార్యాలయావరణ పరిసరాలను పరిశుభ్రం చేయడం జరిగింది. ఎస్.వి గారితో పాటు అధికారులు కింద సిబ్బంది అందరూ కలిసి పోలీస్ ఆవరణలో వ్యర్థాలను చెత్తాచెదారాన్ని తొలగించే ఉత్సాహంగా శ్రమదానం చేయడం జరిగింది సామాజిక బాధ్యత కాలానుగుణ అవగాహన పోలీసు యంత్రాంగం కేవలం శాంతి భద్రతల పరిరక్షణలోనే కాకుండా సామాజిక బాధ్యతలను ముందుండాలని మనం పని చేసే చోట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ తమ సిబ్బందికి అవగాహన చేయడం జరిగింది స్వచ్ఛత పరిశుభ్రత అనేది ఒక రోజుతో ముగిసేది కాదని మన దైనందిన జీవితంలో భాగంగా మారాలని ఆయన సూచించారు వేసవి వేడి తీవ్రత మరియు కఠినమైన వాతావరణ పరిస్థితిని తట్టుకునేలా సిబ్బందికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విధులు నిర్వహించే సమయంలో తగినంత నీరు తాగుతూ విధులు నిర్వహిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నది ఈ కాలంలో నీటి ప్రతి చుక్క విలువైనదని కార్యాలయాల్లో ఇళ్లల్లో నీటిని వృధా అరికట్టి నీటి సంరక్షణ ఒక బాధ్యతగా చేపట్టాలని ఆయన వారు సిబ్బందికి పిలుపునిచ్చారు అలాగే మన ఇంటి పరిసరాలు మనం పనిచేసే కార్యాలయాలు ఆఫీసులు మొక్కలు చెట్లను పెంచి చల్లని వాతావరణాన్ని పచ్చదనాన్ని నింపాలని దాని వలన వేడి తీవ్రత తగ్గుతుందని పరిసరాలు కూడా చల్లదనం ఉంటాయని స్వచ్ఛమైన గాలి లభిస్తుందని ప్రకృతి వనరులను కాపాడుకోవడంలో ప్రతి పోలీస్ అధికారి భాగస్వాములు కావాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జి ఆర్ ఆర్ మోహన్, బి మోహన్ రావు, ఇన్స్పెక్టర్ బాల సూర్యరావు, లక్ష్మి, ధనంజయ్, ఎస్ రమేష్, పి రమేష్, రామకృష్ణ, ఎస్సైలు రమణయ్య, పాల్గొన్నారు



## గృహ గణనకు కావలసిన సమాచారం అందించండి

**మాడుగుల మే 16 జయ జయహే**

మాడుగుల మండలంలో నిర్వహిస్తున్న గృహ గణన కార్యక్రమాన్ని శనివారం తాహసిల్దార్ కే రమాదేవి పర్యవేక్షించారు మండలంలో గృహ గణనకు మొత్తం 113 మంది ఎన్యూమరేటర్లు పనిచేస్తుండగా, 16 మంది సూపర్వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. ఎండిఓ, తాహసిల్దార్ ఈ సెన్సెస్ కార్యక్రమాన్ని పరిశీలిస్తూ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. శనివారం మాడుగులలో మాజీ జెడ్పిటిసి సరోజినీ ఇంటి వద్ద జరుగుతున్న గృహ గణన ను తాసిల్దార్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాడుగుల మండలంలో 29 పంచాయతీల్లో సుమారు 27,700 గృహాలు లో సర్వే జరుగుతుందని, ఈ నెల ఒకటి నుంచి ప్రారంభమైన గృహ గణన ఈ నెల 30 తో ముగుస్తుందని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 60 శాతం గణన పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమం నిమిత్తం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేట్సర్ లకు కావలసిన సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## మాడుగుల ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ మంజూరు

**మాడుగుల, మే 16, జయ జయహే**

మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి కృషి ఫలితంగా మాడుగుల ప్రభుత్వాసుపత్రికి సుమారు 35 లక్షల రూపాయలతో నూతనంగా అంబులెన్స్ మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం ఆస్పత్రి ప్రాంగణంలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్యలను తెలుసుకున్న వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అంబులెన్స్ మంజూరు చేయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి నరేష్, ఆసుపత్రి కమిటీ సభ్యులు , కూటమి నాయకులు, పి లక్ష్మీనారాయణ, ఏం చాయరాం, పూప్పల రమేష్, లెక్కల కాశి బాబు, రోబ్బ మహేష్, మరువాడ ఈశ్వరరావు, ఝూన్సీ, మోది నాయుడు, పల్లెల రాము తదితరులు పాల్గొన్నారు.



## భోగాపురం అనుసంధాన రోడ్లను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలి

**అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

**భోగాపురం ఎయిర్ పోర్టును సందర్శించి అధికారులతో సమీక్ష**

**భోగాపురం, మే 16, జయ జయహే :**

విశాఖ నగరం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను మిషన్ మోడ్‌లో చేపట్టి జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం భోగాపురం విమానాశ్రయ ప్రాంతాన్ని సందర్శించిన కలెక్టర్, విమానాశ్రయ నిర్మాణ పురోగతితో పాటు అనుసంధాన రహదారులు, కూడళ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కూడళ్ల వద్ద పటిష్ట నిర్మాణ పనులు చేపట్టాలని, భవిష్యత్తు ట్రాఫిక్, భద్రత అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ఎయిర్ పోర్టు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపనున్న బ్యాటరీ వాహనాల కోసం విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారి, నగర పరిధిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల దిశలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ, ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనులను వేగవంతం చేయాలని, జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయా రహదారుల వెంట విద్యుత్ దీపాల అమరిక పనులను కూడా సమయానికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. పనులన్నింటినీ సమన్వయంతో, మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఫారెస్ట్ శాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశం అనంతరం కలెక్టర్ ఎయిర్ పోర్టు లోపలి భాగాలను, ఏటీసీ కార్యాలయంను సందర్శించారు.సమావేశంలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ఎయిర్‌పోర్టు సీఈవో కన్వర్ బీర్ సింగ్, సీడీవో కోటేశ్వరరావు, జీఎంఆర్ కార్పొరేట్ అఫైర్స్ అధికారి రామరాజు, సీఎస్వో శాస్త్రి, సీవోవో లక్ష్మీవర్మ భాస్కర్, వీఎంఆర్డీఏ సీఈ వినయ్, జీవీఎంసీ సీఈ సత్యనారాయణరాజు, సీసీపీ ప్రభాకర్, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

# టెక్కలి వంశధార అతిథి గృహానికి ఆదరణ కరువు

## ఒకనాటి అధికారిక భవనం ఈనాడు శిథిలావస్థలో

**టెక్కలి మే 16 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి వంశధార వ్యవస్థ ఎడమ కాలువ నిర్మాణములో ఉన్నతాధికారుల, ముఖ్య కార్యాచరణ నివాసంగా ప్రాధాన్యత వహించిన టెక్కలి వంశధార క్యాంపస్ లో నిర్మితమైన అతిధి గృహం నేడు ఆదరణ కరువై గు బురు పొదల్లో అసాంఘిక కార్యక్రమాల అడ్డగా మారి శిధిలానికి చెరువులో ఉండటం స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒడిస్సా రాష్ట్రంలో పుట్టిన వంశధార కాలువ జలాలు గొట్టా బ్యారేజ్ ద్వారా శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి నందిగాం, కోటబొమ్మాలి, సంతబొమ్మాలి, వజ్రపు కొత్తూరు, పలాస, మారుమూల గ్రామ ప్రాంతాలకు



సాగునీరు, త్రాగునీటి అవసరాలు తీరుస్తుంది. ఈ అతిధి గృహం నుంచే ఎడమ కాలువ కార్యాచరణలో అధికారిక విధులు నిర్వహించారు, అటువంటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ అదితి గృహం సంబంధిత శాఖల ఆదరణ కరువై నిధులు లేమి నిర్లక్ష్యం నీడలో తో ముళ్ళ పొదల నడుమ శిధిలమైన చిహ్నం లా మిగిలిపోయింది, ఇదే ప్రాంతంలో ప్రజా అవసరాలకు అవసరమైన జిల్లా ఆసుపత్రి నిర్మాణం, తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు జరిగినప్పటికీ ఈ భవనం మాత్రం శిధిలానీ కి సిద్ధంగా ఉంది, ప్రజలకు వ్యవసాయశీ, చెరువుల ద్వారా మంచినీటి అవసరాలు తీర్చే అధికారిక అతిధిగృహం పునర్ పరిశీలించి సమగ్ర నిధులు కేటాయించి ఈ అతిధి గృహాన్ని ఆధునికరించాలని పలువురు రైతులు, విశ్రాంతి ఉద్యోగులు స్థానికులు కోరుతున్నారు.



## పోడి చెత్త సేకరణపై ఎక్సైజ్ అధికారులు వైన్ యజమానులతో సమావేశం

**మాడుగుల మే 16 జయ జయహే**

ఎస్ ఏ ఎస్ ఏ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పొడి చెత్త సేకరణలో తగు సహకారం అందించాలని ఎండిఓ కే అప్పారావు మాడుగుల ఎక్సైజ్ అధికారులను మద్యం షాప్ యజమానులను కోరారు. శనివారం ఎండిఓ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాడుగుల మండలంలో గల అన్ని వైన్ షాప్ ల నుండి వచ్చు పొడి చెత్త ను స్వచ్ఛరథం ఆపరేటర్ కు అందజేయాలని కోరారు. తద్వారా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ అభియాన్ కార్యక్రమానికి విజ్ఞప్తి చేశారు.



## వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

### దంత వైద్యులు డాక్టర్ జాన్ కోషే

**పెదకూరపాడు, మే 16( జయ జయహే )**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు, సహాయకులకు వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన జనచైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులను సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్య నిపుణులు డాక్టర్ జాన్ కోషే అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద జన చైతన్య సమితి ఆధ్వర్యంలో మూడవ మూడవ చలివేంద్రాన్ని శనివారం డాక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరు సాంబశివరావు మాట్లాడుతూ నిత్యం అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు వస్తున్నారని తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకే ఈచలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు,నిర్వాహకులు కొర్రపాటి వెంకటేశ్వర్లు, హాస్పటల్ సిబ్బంది రూప ప్రియదర్శిని,రాశంశెట్టి విజయలక్ష్మి, దొడ్డ శ్రీలక్ష్మి, సుంకరి కమల తదితరులు పాల్గొన్నారు



## ఆనందపురం ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

### భోగాపురంను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాయుతంగా వ్యవహరించాలి

### పలు విభాగాల అధికారులతో కలిసి పరిశీలించిన.. కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**ఆనందపురం, మే 16, జయ**

జయహే : ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శనివారం ఎయిర్ పోర్టు, జాతీయ రహదారి విభాగం, వీఎంఆర్డీఏ, రెవెన్యూ, పోలీసు విభాగాల అధికారులతో కలిసి ఆనందపురం కూడలిని పరిశీలించిన ఆయన ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణం అమలు చేయగల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఫ్లైఓవర్ కింద విస్తరణ పనులు చేపట్టి, తాత్కాలికంగా ట్రాఫిక్ సమస్యలను తగ్గించే చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రాంత పరిస్థితులను సూక్ష్మంగా అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని హితవు పలికారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, భోగాపురం ఎయిర్‌పోర్టు సీఈవో కన్వర్ బీర్ సింగ్, ఎన్.హెచ్.ఎ.ఐ. ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్, వీఎంఆర్డీఏ సీఈ వినయ్ కుమార్, జీవీఎంసీ సీఈ సత్యనారాయణ రాజు, జీఎంఆర్ కార్పొరేట్ అఫైర్స్ అధికారి రామరాజు, సీఎస్వో శాస్త్రి, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఉపాధి కూలీలకు మజ్జిగ మంచినీరు పంపిణీ

**చోడవరం మే 16 జయ జయహే**

జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం చోడవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ శ్రీ పివిఎస్ఎన్ రాజు ఆదేశానుసారం చూడవరం మండలం గోవాడలో పనికి ఆహార పథకం కూలీలకు గోవాడ గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి రామప్పరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏడవక నూకరాజు, ప్రధాన కార్యదర్శి బండి గోపి, నీటి సంఘం డైరెక్టర్ ఏడువాక శ్రీనివాసరావు, పాల డైరెక్టర్ ధర్మ శెట్టి దాలినాయుడు, బండి బుజ్జి, ఏడువాకు శంకర్రావు, ఏడువాక గోపి ,పాము గోపి, సేనాపతి అప్పలనాయుడు, సేనాపతి రాజేష్,కోట్ని నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి ఎమ్ ఎల్ సీ సి

**మాడుగుల మే 16 జయ జయహే**

ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ఆర్జీల స్వీకరణ కార్యక్రమంలో పరిష్కారం కానీ సమస్యలపై శనివారం ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారు. దాన్ని భాగంగా ఈ శనివారం తాటిపర్తి, అవురూవాడ గ్రామాల నుంచి వచ్చిన భూ సమస్యలు పరిష్కారానికి తహసిల్దార్ కే రమాదేవి ఆధ్వర్యంలో అధికారులు చర్చించారు. అయితే సమస్య కొలిక్కి రాగిపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి బి జగదీశ్వరరావు, ఎండిఓకే అప్పారావు, ఉప తహసిల్దార్ రాజా, పోలీస్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## పాత ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలి

**చోడవరం, మే 16, జయ జయహే**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులను తక్షణం రద్దుచేసి పాత మహాత్మా గాంధీ ఉపాధి చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం చోడవరం మండలం లక్కవరం గ్రామంలో జరుగుతున్న చెరువు పనుల వద్ద కూలీలతో కలిసి నిరసన తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి అమలు కాలున్న వి బి జి రామ్ జి పథకంతో పని హక్కు గ్యారంటీ కోల్పోతారని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని ఒక పథకంగా మార్చి నీరుగార్చారని, మహాత్ముని పేరు తొలగించారని ఇప్పటివరకు ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి కుదించడం, కేంద్ర బడ్జెట్ లో నిధులు కోత పెట్టటం వంటి చర్యలకు పూనుకుందని అన్నారు. కొత్తగా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా రాష్ట్రాలపై పెద్ద ఎత్తున భారం పడటంతో పాటు భవిష్యత్తులో ఉపాధి హామీ పథకం కనుమరుగ అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి దొరకక వేరే ప్రాంతాలకు వలసలు పోతున్నారని, ఈ ప్రాంతంలో షుగర్ ఫ్యాక్టరీ మూతబడడంతో ఉన్న ఉపాధిని ఈ ప్రాంత ప్రజలు కోల్పోయారని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజుకు 600 రూపాయలు వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్ వి నాయుడు, జీ దేవుళ్ళు, అప్పారావు, లక్ష్మమ్మ పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# బంగారు ఆభరణాల దొంగల ముఠా అరెస్ట్

**అనకాపల్లి మే16 జయ జయహే**

మునగపాక మండలం వెంకటాపురం గ్రామంలో ఈ నెల మే రెండో తేదీన జరిగిన ఒక భారీ దొంగతనంలో కేసును చేదించిన పోలీసులు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసును చేదించే క్రమంలో పక్కా సమాచారంతో అనకాపల్లి జిల్లా పోలీసులు భారీ విజయాన్ని సాధించారు వివిధ జిల్లాల వరుస దొంగతనాలు పాల్పడుతున్న ముగ్గురు మోస్ట్ వాంటెడ్ అంతర్ జిల్లా దొంగలను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారిని అరెస్ట్ చేయడం జరిగింది వారి వద్ద నుండి సుమారు 66 లక్షల విలువైన 450 గ్రాముల బంగారు ఆభరణాలు 250 గ్రాములు వెండి వస్తువులను స్వాధీనం చేసుకోవడం జరిగింది శనివారం ఉదయం 8 గంటలకు మునగపాక ఎస్సై ప్రసాదరావుకి ఒక ద్వారా నమ్మకాస్తమైన సమాచారం రావడంతో ఆయన సిబ్బందితో కలిసి అనకాపల్లి బైపాస్ రోడ్డు లో లక్ష్మీపురం బస్టాప్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు ఆ క్రమంలో ఒక మోటార్ సైకిల్ పై వస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు చూసి తప్పించుకోవడానికి ప వారిని గుర్తించి,అలర్ట్ అయిన పోలీస్ సిబ్బంది వారిని వెంబడించి పట్టుకోవడం జరిగింది పోలీసు విచారణలో నిందితులు ముగ్గురు పాత నేరస్థులని నిందితులను లోతుగా విచారించగా మునగపాకతో పాటు ఎలమంచిలి టౌన్ ఎలమంచిలి రూరల్ రాంబిల్లి అనకాపల్లి రూరల్ సబ్బవరం ఎస్ కోట గుంటూరు జిల్లా నాదెండ్ల కూడా దొంగతనాలు చేసినట్లు వారు అంగీకరించారు ,వారిపై ఇప్పటికే పలు




స్టేషన్లో రౌడీషీట్లు సస్పెక్ట్ షీట్ ఉన్నట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మీడియా సమావేశంలో తెలియజేశారు ఈ కేసును అత్యంత చాకచక్యంగా చేదించిన పరవాడ సబ్ డివిజన్ ఇన్చార్జి డీఎస్పీ బి మోహన్ రావు ఎలమంచిలి సర్కిల్ సిఐ ధనుంజయ రావు రాంబిల్లి సిఐ సిహెచ్ నర్సింగ్ రావు అనకాపల్లి సిసిఎస్ కె అప్పలనాయుడు ఫింగర్ ప్రింట్ ఇన్స్పెక్టర్ టి విజయ మరియు ఎస్ఐలు ప్రసాదరావు మునగపాక, సావిత్రి ఎలమంచిలి, నాగేంద్ర రాంబిల్లి, రామకృష్ణ ఎలమంచిలి ట్రాఫిక్, విశ్వనాథ శీ సిసిఎస్ మరియు సిబ్బంది నీ వీరందరినీ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి వారికి ప్రశంసా పత్రాలు నగదు పురస్కారాలు అందజేయడం జరిగింది

## ఈనెల 19న నక్కపల్లిలో మెగా జాబ్ మేళా


**చోడవరం , మే 16, జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా ఈనెల 19 నక్కపల్లి గర్ల్స్ హైస్కూల్లో సుమారు 15 బహుళజాతీయ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఎన్. గోవింద రావు శనివారం తెలియజేసారు. ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి,ఐ టి ఐ, డిప్లొమా,డిగ్రీ, పి జి వరకు చదువుకొని 18 నుండి 40 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను నైపుణ్యం. ఏపీ.జీవో వి. ఐ ఎన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డు తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు,ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో జాబ్ మేళా జరుగు ప్రదేశానికి ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 8247505171నంబర్లను సంప్రదించగలరు.

# పరీక్షలలో ప్రశ్నాపత్రాల లీక్‌ను అరికట్టాలి

(సి.హెచ్.ప్రతాప్)




విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే జాతీయ మరియు రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలను న్యాయసమ్మతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడం ఒక దేశ సమర్థతకు సంకేతం. విద్యా వ్యవస్థలో పరీక్షలు అనేవి కేవలం మార్కుల కోసం మాత్రమే కాకుండా, విద్యార్థుల ప్రతిభను గుర్తించే గీటురాళ్లుగా నిలుస్తాయి. అయితే ఇటీవల కాలంలో పరీక్ష పత్రాల లీక్ సంఘటనలు దేశవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా నీట్ 2026 పరీక్షల సమయంలో ప్రశ్నపత్రం లీక్ కావడం, తదనంతరం పరీక్ష రద్దు కావాల్సి రావడం లక్షలాది మంది విద్యార్థులను ఆవేదనకు గురిచేసింది. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలు, వారి తల్లిదండ్రులు తమ ఆర్థిక స్తోమతకు మించి కోచింగ్, వసతుల కోసం చేసిన ఖర్చు ఒక్కసారిగా బూడిదలో పోసిన పన్నీరుగా మారింది.

గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా చోటు చేసుకున్న ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతాలను పరిశీలిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. 2024లో వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష దేశవ్యాప్త నిరసనలకు దారితీసింది. ఇదే కాకుండా 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్ష పేపర్ లీక్ కారణంగా సుమారు 48 లక్షల మంది అభ్యర్థులు ప్రభావితమయ్యారు. 2025లో రాజస్థాన్ మరియు హర్యానాలో జరిగిన పలు ఉపాధ్యాయ నియామక పరీక్షలు కూడా లీకేజీల కారణంగా రద్దయ్యాయి. తెలంగాణలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్ పరీక్షల పత్రాల లీకేజీ వ్యవహారం అభ్యర్థులలో తీవ్ర అభద్రతా భావాన్ని నింపింది. ఇటువంటి సంఘటనలు కేవలం నిర్వాహక వైఫల్యాలు మాత్రమే కాదు, విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే సామాజిక విపత్తులు.

పరీక్షల రద్దు వల్ల కలిగే నష్టాలు బహుముఖం. నీతి పరమైన దృష్ట్యా విద్యా వాతావరణం గందరగోళానికి గురవుతోంది. నిజాయితీగా చదివే విద్యార్థులలో వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లుతోంది. ముఖ్యంగా వైద్య విద్య వంటి వృత్తిపరమైన కోర్సుల్లో ఇటువంటి అక్రమాలు జరగడం ఆరోగ్య రంగంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది. వైద్యులుగా రాణించాలనుకునే వారు నిశ్చితమైన శిక్షణ పొందాలి, కానీ లీకేజీల వల్ల అనర్హులు వ్యవస్థలోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. ఇది సమాజానికి తీరని నష్టం కలిగిస్తుంది.

ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం రెండు కీలక చర్యలు తీసుకోవడం అత్యవసరం. మొదటిది, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరీక్షా పత్రాల రక్షణకు కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాలి. డిజిటల్ ఎన్క్రిప్షన్ పద్ధతులు, పరీక్ష కేంద్రాలపై నిరంతర ఆడిటింగ్ మరియు ప్రశ్నపత్రాల పంపిణీలో మానవ ప్రమేయాన్ని తగ్గించడం వంటి మార్పులు తీసుకురావాలి. రెండవది, దేశంలో మెడికల్ సీట్ల సంఖ్యను గణనీయంగా పెంచాలి. పోటీ ఎక్కువగా ఉండి సీట్లు తక్కువగా ఉండటం వల్లనే అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది. సీట్లు పెంచడం ద్వారా ఒత్తిడి తగ్గి, అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చు.

విచారణలు వేగంగా పూర్తి చేసి, దోషులను కఠినంగా శిక్షించాలి. బాధిత విద్యార్థులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలి. నిజాయితీతో చదువుకునే వారిని నిరాశ పరిస్తే దేశ నైపుణ్య సంపద ప్రమాదంలో పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, అది దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశం.

# అభివృద్ధి పనుల్లో స్వచ్ఛంద సంస్థల సహకారం: గంటా

ఎండాడ, మే 16: (జయ జయహే)



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ. 4 కోట్లతో రోటరీ క్లబ్ అభివృద్ధి చేయనున్న ఎండాడ స్మశాన వాటిక ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లో స్మశానాలు, పార్కులు, ఓపెన్ స్పేస్ ల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. అభివృద్ధిలో రోటరీ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ వై. కళ్యాణ చక్రవర్తి, అధ్యక్షుడు పీవీ రఘుపతి, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ఏఎంఓహెచ్ రవికుమార్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపీ తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవులపై కూటమి ప్రభుత్వం దాడి





బొల్లవరపు జాన్ వెస్లీ

విజయవాడ (జయ జయహే)

విజయవాడలోని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పమీడియా సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ విజయవాడ గొల్లపూడి దగ్గర గల వైయస్సార్ ఘాట్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో క్రైస్తవుల బాప్తిస్మాలు కోసం నిర్మించిన వైయస్సార్ ఘాటును అక్కడి నుంచి లేకుండా చేయాలని ఒక దురుద్దేశంతో అక్కడ వాటర్ ట్యాంక్ పేరుతో కడుతున్న నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. క్రైస్తవుల మనోభావాలు దెబ్బ తినే విధంగా ప్రభుత్వమే క్రైస్తవుల మీద దాడి చేస్తున్న ఇలాంటి చర్యలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఖండిస్తున్నామని తెలియజేశారు. ఈ భారత దేశంలో మతానికి ఒక ప్రత్యేకత ఉందని, భారత దేశ సంస్కృతి మతాలతో ముడిపడి ఉన్నదని అందువలన అన్ని మతాలను గౌరవించాలని భారత రాజ్యాంగంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్టికల్ 25 నుండి ఆర్టికల్ 28 వరకు మత స్వేచ్ఛను దేశ ప్రజలకు అందించడం జరిగిందని, మత స్వేచ్ఛ మాత్రమే కాదు మతాన్ని ప్రచారం చేసుకునే వీలును కూడా వ్యక్తులకే కాదు వ్యవస్థలకు కూడా రాజ్యాంగం కల్పించి అందించిందని ఆ విషయాన్ని ఈ కూటమి పాలకులు విస్మరించి క్రైస్తవుల మీద, క్రైస్తవ వ్యవస్థల మీద ఈ కూటమి ప్రభుత్వం దాడి చేస్తుందని తెలియజేశారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపించి ప్రజలందరూ కలిసి ఉండేలా చేయవలసిన ఈ కూటమిలోని ముఖ్య నాయకులే మతాలను రెచ్చగొడుతూ క్రైస్తవులను ఈ సమాజంతో వేరు చేసే విధంగా చేస్తున్నారని విమర్శించారు.సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలో నడుస్తున్న ప్రభుత్వం ఒక నియంత్రత్వ మతతత్వ సిద్ధాంతాలతో ముందుకు వెళు తున్నదని దీనివలన ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతున్నదని, పోలీసులందరూ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారని రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో మంత్రి నారా లోకేష్ ప్రతీకార రాజకీయాలకు తెర లేపి అరెస్టులు చేస్తున్నారని తెలియజేశారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గతంలో పర్మిషన్ లేని చర్చిల వివరాలను సేకరించాలని పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఆయన వివరణ కోరడం ద్వారా క్రైస్తవుల పై దాడులకు దారులు తెరుచుకున్నాయని తెలియజేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు మరి కొంచెం ముందుకు వెళ్లి క్రైస్తవులు అనేవారు అసలు ఆంధ్రప్రదేశ్ లోనే ఉండకూడదు అనే విధంగా పర్మిషన్ లేని చర్చ్ లకు నోటీసులు పంపించడం జరిగిందని, వీటన్నిటి వలన క్రైస్తవులలో ఒక అభద్రత భావం పెరిగి పోయిందని తెలియజేశారు. 2023 వ సంవత్సరంలో అశ్విని ఉపాధ్యాయ మరియు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసిన రిట్ పిటిషన్లో సుప్రీంకోర్టు ఒక రూలింగ్ ఇచ్చిందని ఆ రూలింగ్ ప్రకారం సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కు క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సుమోటోగా కేసు పెట్టవలసిందిగా కోరిందని దాని ప్రకారం రాష్ట్ర గవర్నర్ 2025 మే 27వ తారీఖున రాష్ట్ర డిజిపి కి లెటర్ పంపించడం జరిగింది. ఆ లెటర్ ప్రకారం ఇంతవరకు ఈ కూటమి ప్రభుత్వం క్రైస్తవులపై దాడులకు వ్యతిరేకంగా ఎన్ని కేసులు పెట్టారో ఒక శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలియజేశారు.జగన్మోహన్ రెడ్డి హయాంలో క్రైస్తవులందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని రాష్ట్రంలోని ప్రతి పేద సంఘ కాపరికి 5000 రూపాయల గౌరవ వేతనాన్ని అందించడం జరిగిందని . ఈ కోటం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంతవరకు కొత్తగా ఎవరికి కూడా 5000 రూపాయలు మంజూరు చేయడం జరగలేదని తెలియజేశారు. అదేవిధంగా క్రైస్తవుల సంక్షేమం కోసం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 416 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగిందని ఒక లక్ష 80 వేల మంది క్రైస్తవులకు లబ్ధి చేకూరిందని తెలియజేశారు. అదేవిధంగా క్రైస్తవులకు పవిత్ర స్థలమైన జెరుసలెం వెళ్లే యాత్రికులు అందరికీ రాయితీలు కల్పించి ప్రభుత్వం ద్వారా జెరూసలేము యాత్రకు పంపించడం జరిగిందని తెలియజేస్తూ ఈ కూటం ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక క్రైస్తవుడిని కూడా జెరూసలేము యాత్రకు పంపించలేదని తెలియజేశారు. 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో క్రైస్తవులు అందరూ కూటం ప్రభుత్వానికి నమ్మి ఓట్లు వేసినందుకు క్రైస్తవులందరూ బాధపడే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలియజేశారు. రేపు రాబోయే రోజుల్లో ఎప్పుడు ఎలక్షన్స్ జరిగిన క్రైస్తవులందరూ ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జేపీ సుధాకర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గేరా హ్యాంకాక్ ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెక్రటరీ సందీప్ అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు శ్రీవైపి బాబు పాల్గొన్నారు.




## జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీ అవగాహన కార్యక్రమాలు

గోకవరం జయ జయహే ప్రతినిధి

గోకవరం మండలం జి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధి కారులు డా. తిరన్, డా. నిఖిత పర్యవేక్షణ లో మండలంలో పలు గ్రామాలలో "జాతీయ డెంగ్యూ దినోత్సవ "ర్యాలీలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా గోకవరం నందు ప్రతిజ్ఞ,ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతీఒక్క పౌరుడు ఆరోగ్యం కోసం డెంగ్యూ వ్యాధి ని నివారించేందుకు కట్టుబడి వుండాలని ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి అయ్యే ప్రదేశాలను పరిశీలించి నిల్వ లను శు భ్రపరచాలని, వారానికి ఒకసారి నీటినిల్వలను ఖాళీ చేయాలని, పూలకుండీలు, కూలర్లు, ఫ్రిజ్ లు, టైర్లు వంటివాటిలో దోమలార్వా లు లేకుండా జాగ్రత్త పడాలని,దోమల వృద్ధిని అరికట్టుటకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కుటుంభ సభ్యులకు, పొరుగు వారికి, సమాజానికి అవగాహన పెంచేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో హెచ్. వి. రాజేశ్వరి,హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, అప్పారావు, శ్రీను టి .బి యూనిట్ నుండి దేవి, అమృత తదితరులు పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియం ప్రారంభించిన గంటా

బిమధురవాడ, మే 16: (జయ జయహే)



జీవీఎంసీ 6వ వార్డు పరిధిలోని పీఎం పాలెం అశోక్ నగర్ పార్కులో రూ.40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన స్టేడియాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. పీపీపీ మోడల్ లో ప్రతిపాదించిన స్టేడియానికి దిడ్ల అశోక్ కుమార్ రూ. 25 లక్షలు సమకూర్చగా.. అశోక్ నగర్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.15 లక్షలు అందజేసింది. కార్యక్రమంలో అశోక్ నగర్ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల గౌతం బాబు ప్రతినిధులు కెవిఆర్ పట్నాయక్, గంటి మోహనరావు బి.ఎస్.ఎన్. మూర్తి, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు ఏఎమ్ఓహెచ్ రవికుమార్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గరే గురునాథ్, లొడగల జానకి రామ్, దాసరి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపి, బోయి శ్రీనివాసు, నాగోతి వెంకట సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, నాగోతి సూర్యప్రకాష్, పిల్లా మోహన్ కృష్ణ, గొల్లంగి ఆనందబాబు, పోతిన ప్రసాద్ పాల్గొన్నారు.



## శైలజనాథ్‌కు టీడీపీ నేత పాండు ఘాటు కౌంటర్

### "ప్రజల కోసం పని చేస్తున్న ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగవు"

గార్లదిన్నె, మే 16: ( జయ జయహే )

సింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం పాపినిపాల్యం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై వైఎస్సార్సీపీ నాయకుడు సాకే శైలజనాథ్ చేసిన వ్యాఖ్యలకు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ రంగనాయకులు (పాండు) ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీపై రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.ఇటీవల పాపినిపాల్యం గ్రామాన్ని సందర్శించిన శైలజనాథ్.. గ్రామంలో నీటి సమస్య ఉందని పేర్కొంటూ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. "ఏసీ గదుల్లో కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు" అంటూ వ్యాఖ్యానించారు.దీనిపై స్పందించిన పాండు మాట్లాడుతూ.. గ్రామంలో నీటి కొరత ఉన్న విషయం వాస్తవమేనని, అయితే తెలుగుదేశం ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ వెంటనే స్పందించి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారని తెలిపారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ఎమ్మెల్యేపై రాజకీయ ఉనికి కోసం బురద జల్లడం సరైంది కాదు. పూటకో పార్టీ మారే నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదం" అని పాండు విమర్శించారు. ప్రజల్లో మంచి ఆదరణ పొందుతున్న నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ శ్రీనివాసులు, యూనిట్ ఇంచార్జ్ నాగభూషణ్, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణస్వామి, టీడీపీ నాయకులు నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

## అలరించిన ఆకాశవాణి

# అలనాటి మధుర భావ గీతాలు





### ఆహూతుల సమక్షంలో విరబూసిన సంగీత సోయగాలు

### 90 వసంతాల జాతీయోత్సవాల్లో వెల్లి విరిసిన రసతంత్రులు

**విశాఖపట్నం (జయ జయహే)**

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం నిర్వహించిన అలనాటి మధుర గీతాలు ఆద్యంతం మాధుర్యాన్ని పంచాయి. కళాభారతి వేదికగా శుక్రవారం డాక్టర్ ద్వారం విజెజి త్యాగరాజు సంగీత నిర్వహణలో 90 వసంతాల ఆకాశవాణి వేడుకలు ఆహుతులను అలరించాయిఅలనాటి మధుర భావ గీతాలు మధురానుభూతిని ఇచ్చాయి. వందేమాతరం గీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో అదిగదిగో అదే అదే.. (కృష్ణ శాస్త్రి ), వెన్నెలేమో పంపింది.. (ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గీతం) ను పవన్ కుమార్ చరణ్, సురభి శ్రావణి పాడారు.డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రీజనల్ ఛానెల్ మేనేజర్ ఆర్. హర్షలత మఆకాశవాణి ప్రస్థానాన్ని వివరించారు. విజ్ఞానం వినోదం సహా అత్యవసర పరిస్థితుల్లో సేవలందిస్తోంది అన్నారు. ఎఫ్ ఎం ప్రారంభం తరువాత ప్రాచుర్యంలోకి వచ్చి ఎన్నో సేవలతో ముందుకు వెళుతున్నామన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆకాశవాణి లో మనసులో మాటగా ప్రజలకు చేరువ చేస్తున్నారన్నారు. డైరెక్టర్ ఇంజనీరింగ్ కృష్ణారావుమాట్లాడుతూ అగనంపూడి నుండి మొదలైన ఆకాశవాణి విశాఖపట్నం ప్రస్థానం వివరించారు. రాజమండ్రి, శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం భవిష్యత్తులో ఏజెన్సీ చింతపల్లి, విజయనగరం, సింహాచలం ప్రాంతాల నుండి కూడా నాణ్యమైన కార్యక్రమాలు అందించే ప్రయత్నం చేస్తున్నాం అన్నారు. న్యూస్ ఆన్ ఎయిర్ ద్వారా కూడా మరింత సేవలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమ విభాగాధిపతి పివి రామ్ గోపాల్ మాట్లాడుతూ ఆలిండియా రేడియోగా ఉన్న వ్యవస్థ ఆకాశవాణిగా మారడం, 90 వసంతాల ఆకాశవాణి వరకూ వచ్చిన మార్పులు వివరించారు. జాతీయ సంగీత కార్యక్రమాలు 1952 లో ప్రారంభమయ్యాయని, రేడియో సంగీత సమ్మేళనాలు 1954 లో మొదయ్యాయనీ, చెప్పిన ఆయన 1985 నుండి ప్రైమరీ ఛానెల్ మొదలయ్యిందనారు. రేడియో న్యూస్ యూనిట్ 1950-70 లో మొదలై 2017 లో విశాఖలో మొదలయ్యిందన్నారు. ఐపిఎస్ సేవలు వివరిస్తూ పలు అంశాలు విశదీకరించారు. 1952 లో తీసుకున్న నిర్ణయంతో లలిత సంగీతం ప్రారంభం అయ్యిందన్నారు. 1957 లో మొదలైన వివిధ భారతి కాలక్రమంలో చోటు చేసుకున్న మార్పులు వివరించారు. మ్రోగింపు జయభేరి.. గీతం బాలాంత్రపు రజనీకాంత్ రూపొందించిన గీతం 1947 రాత్రి ప్రసారం అయ్యిందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఆకాశవాణి అందరిదీ అన్నారు. బహుజన హితాయ బహుజన సుఖాయ నేపథ్యంలో ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. లేఖావళి లేఖకునిగా రేడియోతో అనుబంధం కలిగిన తాను ఆకాశవాణి 90 వసంతాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనందదాయకం అన్నారు. ఆకాశవాణి అంటే నిబద్ధతకు మారు రూపు అన్న ఆయన ఎప్పటికీ ఆకాశవాణి సమయపాలన నిర్దిష్టమైనదన్నారు. ఇదే వేదికపై జీవీఎంసీ అదనపు కమిషనర్ నల్లనయ్య, ద్వారం త్యాగరాజు లను ఉచిత రీతిన సత్కరించారు. ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్ రాంభట్ల నృసింహ శర్మ మాస్టర్ ఆఫ్ శర్మనీ గా వ్యవహరించిన కార్యక్రంలో సహాయ సంచాలకులు కె. ఇందిరా, కార్యక్రమ నిర్వహణ అధికారులు సంఘమిత్ర పాల్, ఎన్. సుధాకర రెడ్డి, టి. దిలీప్ కుమార్ రెడ్డి తదితరులు సారధ్యం వహించారు.

# ట్రంప్ కుంపటితో ఆర్థిక రంగం కుదేలు!



ఇరాన్‌పై దాడితో ప్రపంచ దేశాలను ప్రమాదంలో పడేసిన ట్రంప్ ఇంకా మేల్కొనలేదు. తనవల్ల ప్రపంచం అతలాకుతలం అయ్యిందే అన్న కించిత్ చింతన కూడా కానరావడం లేదు. పైపచ్చు..ఇరాన్‌ను భూమండలం మీద లేకుండా చేస్తామని కూడా ప్రకటించారు. ఇరాన్ సంగతి ఎలా ఉన్నా...భారత్ లాంటి దేశాలు చమరు ధరలతో విలవిల్లాడుతున్నాయి. ఆర్థిక సంక్షోభం తప్పేట్లుగా లేదు. చమురు రవాణా ఆగిపోవడంతో పాటు, ముడి చమురు ధరలు పెరగడంతో నానాయాతన పడాల్సి వస్తోంది. తాజాగా భారత్‌లో పెట్రీ, డీజిల్ దలరు పెరిగాయి. ఈ పెరుగుదల ఒక్క ఇంధనంపైనే ఉండదు. ఇకనుంచి అన్నిరంగాల పై దీని ప్రభావం పడుతుంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతాయి. విమానయాన రంగం ఇప్పటికే గగనకుసుమమైంది. ఇది మరింత ప్రమాదంలో పడనుంది. వెరసి సామాన్యుల బతుకులు భారం కానున్నాయి. పొదుపు మంత్రం ప్రకటించిన ప్రధాని మోడీ కాన్వాయ్‌లను తగ్గించారే తప్ప, అసలు పొందుపు విషయంలో మాట్లాడడం లేదు. దేశంలో ప్రజాప్రతినిధుల దుబారాను తగ్గించే ప్రయత్నాలపై ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. దీనికితో తోడు ఈ సంక్షోభం దృష్ట్యా ఐటి కంపెనీల్లో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. రిక్రూట్‌మెంట్లు తగ్గాయి. ప్రధాని మోడీ ఇచ్చిన వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానం అమలు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కరోనా సమయంలో విధిలేక ఆఫీసులు మూసుకున్న ఐటి కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులను వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిమితం చేయదల్చుకోలేదు. దేశంలో పెరుగుతున్న ఇంధన వినియోగాన్ని తగ్గించి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఉద్యోగులు వీలైనంత వరకు ఇంటి నుండే పని చేసే విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, దేశీయ ఐటీ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌పై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడానికి ప్రతిరోజూ సగటున 50 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణం వల్ల అటు ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాకుండా, భారీగా ఇంధనం ఖర్చవుతోంది. ప్రధాని సూచన మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ రంగంలో ఈ విధానం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. నగరంలోని మొత్తం ఐటీ ఉద్యోగులలో కనీసం సగం మంది, అంటే సుమారు 4.5 లక్షల మంది వారానికి కేవలం మూడు రోజులు ఇంటి నుండి పని చేసినా అద్భుతమైన ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నెలకు దాదాపు 140 కోట్ల రూపాయల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఇలా ఒక్కో నగరాన్ని తీసుకుంటే గణనీయమైన మార్పులు ఉంటాయని అంటున్నారు. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం విజయవంతంగా అమలు జరిగినప్పటికీ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద కంపెనీలు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తుండగా, కొన్ని చిన్న స్థాయి సంస్థలు మాత్రం ఈ విధానం వల్ల తమ ఉత్పాదకత దెబ్బతింటుందని లేదా ఇతర నష్టాలు వస్తాయని ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం నుండి స్పష్టమైన మార్గదర్శకాలు వస్తే తప్ప ఈ విషయంలో క్లారిటీ వచ్చేలా లేదు. కేవలం వర్క్ ఫ్రమ్ హోమ్ మాత్రమే కాకుండా, పెట్రోల్ , డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను

ప్రోత్సహించడం కూడా అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి నుండే పని చేయడం వల్ల ఇంధన దిగుమతులు తగ్గి, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ పెరగడానికి తోడ్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ ఆర్థిక భవిష్యత్తుకు ఈ 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానం ఒక కీలక మలుపు కానుంది. ఇకపోతే ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక ఐటి కంపెనీలు కుదింపు మోజులో పడ్డాయి. ఎడాపెడా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించిన అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్.. తాజాగా మరో షాకిచ్చింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి పలు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ పక్రియ ద్వారా విద్యార్థులకు జారీ చేసిన జాబ్ ఆఫర్ లెటర్లను, ప్రీ-ప్లేసమెంట్ ఆఫర్ల (పీపీఓ)ను కంపెనీ రద్దు చేసింది. ఒరాకిల్ తాజా నిర్ణయంతో ప్రభావితమైన కాలేజీల్లో ఎన్ఐటీ వరంగల్, వీఎన్ఐటీ నాగ్‌పూర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ, ఐఐటీ బీహెచ్‌యూ కూడా ఉన్నాయి. ఆఫర్ లెటర్ల రద్దు విషయాన్ని కంపెనీ ఈ వారంలోనే విద్యార్థులకు వెల్లడించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎందుకంటే, చాలావరకు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రాంగణ నియామకాల విషయంలో ఒక విద్యార్థి- ఒక ఉద్యోగం విధానాన్ని అనుసరిస్తున్నాయి. అంటే, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పక్రియలో ఒక కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ అందుకున్న విద్యార్థికి ఇతర కంపెనీల ఆఫర్లను దక్కించుకునే అవకాశం ఉండదు. దాంతో ఒరాకిల్ ఆఫర్ కోల్పోయిన వారిప్పుడు కొత్త ఉద్యోగం కోసం అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన సిస్కో కూడా భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా సిబ్బంది సంఖ్యను దాదాపు 4,000 మేర తగ్గించుకునే ఆలోచనలో ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రభావిత సిబ్బందికి నేరుగా తెలియజేయడం జరుగుతుందని కంపెనీ పేర్కొంది. సిస్కో కూడా తన పెట్టుబడులను కృత్రిమ మేధ (ఏఐ)తో పాటు వేగంగా వృద్ధి చెందుతున్న ఇతర విభాగాల వైపు పెట్టుబడులను మళ్లించే ప్రయత్నాల్లో ఉంది. మైక్రోసాఫ్ట్‌పరమైన వృత్తి నిపుణుల సోషల్ నెట్‌వర్కింగ్ ఎ÷-లాట్‌ఫామ్ లింక్డ్‌ఇన్ సైతం ఉద్యోగులను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. వృద్ధి చెందుతున్న విభాగాలపై దృష్టిపెట్టేందుకు సిబ్బంది పునర్వ్యవస్థీకరించాలను కుంటున్న కంపెనీ.. అందులో భాగంగా 5 శాతం ఉద్యోగాలకు కోత పెట్టాలనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లింక్డ్‌ఇన్‌లో ప్రపంచవ్యాప్తంగా 17,500 ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా ట్రంప్ పెట్టిన కుంపటి ఇప్పట్లో చల్లారేలా లేదు. ప్రపంచ ఆర్థిక స్థితిని ఎంతగా దిగజారుస్తుందో ఇప్పుడే చెప్పలేం. భారత్ ఆర్థిక వ్యవస్థపై మాత్రం తీవ్ర ప్రభావం పడడం ఖాయమని చెప్పవచ్చు.



# వికలాంగులకు వినికిడి పరికరాలు పంపిణీ

**అరకులోయ: జయ జయహే.**

అరకులోయ మండలంలోని వికలాంగులకు శనివారం ఉపకరణాలను పంపిణీ చేశారు. ట్రైబల్ డిజేబుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ కార్యాలయంలో గుర్తించిన చెవుడు సమస్యలున్న వికలాంగులకు చెవి వినికిడి యంత్రాలను సొసైటీ అధ్యక్షుడు బిబి. ధర్మ చేతులు మీదుగా పంపిణీ చేశారు.డుంబ్రి గూడ మండలం అరమ పంచాయతీ,డుంబ్రి వలస గ్రామానికి చెందిన వంతల వెంకటేశ్వరరావు వినికిడి సమస్య ఉన్నట్టు గుర్తించి వినికిడి మిషన్ ఇచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి సమస్యలున్న వారు ట్రైబల్ డిజేబుల్ హెల్పర్ సొసైటీకి దరఖాస్తు చేసుకుంటే వారికి ఉపకరణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వికలాంగులకు అవసరాన్ని బట్టి వీల్చైర్లు, వాకింగ్ స్టిక్స్, ట్రైసైకిల్స్ వంటి పరికరాలు అందజేస్తామన్నారు.అరకులోయ మండల పరిధిలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



# అనాధ పిల్లలకు అన్నదానం

**తెనాలి జయ జయహే న్యూస్:**

తెనాలి మండలం కఠెవరం గ్రామం లో ఉన్న కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ లో అన్నమయ్య జిల్లా, రాయచోటి కి చెందిన బండి ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా శ్రీ నాగారవమ్మా సేవా సమితి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల సహకారంతో , అనాధ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ నందూరి కార్తీక్ మాట్లాడుతూ బండి ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా బండి హరిదీప్ మరియు కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేయడం జరిగిందని, ఆనంద్ ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన , బండి హరిదీప్ కు మరియు వారి కుటుంబ సభ్యులకు స్నేహితులుకు ధన్యవాదములు తెలిపారు. చిల్డ్రన్స్ హోమ్ లో అన్నదానం చేయాలనుకున్న దాతలు 8885333665 నెంబర్ కు సంప్రదించాలని కోరారు, ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ప్లాస్టిక్ రహిత రాష్ట్రం

# దిశగా నిడదవోలు మున్సిపాలిటీ అడుగులు

**నిడదవోలు జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలు మరియు పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచనల మేరకు, గౌరవ నిడదవోలు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో "స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర" మరియు "స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు నిడదవోలు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.

"ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్ " అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానవహారం ఏర్పాటు చేసి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పిస్తూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.ఎల్.పీ.ఎస్.ఎస్. కృష్ణవేణి , సానిటరీ ఇన్స్పెక్టర్ డి. దావీదు రాజు , మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com